Licenced to Post without Prepayment (PMG/VJ/PWPP/17/2009-11)

స్మైల్
సూపర్ స్పెషాలిటీ
• ఈ కార్డు ద్వారా జీవితాంతం కుటుంబసభ్యుల (నలుగురు) ట్రీట్‌మెంట్‌కు అయ్యే ఖర్చులో 30% రాయితీ.
• ప్రభుత్వ ఉద్యోగులకు వారి కుటుంబసభ్యులకు రిటైర్డ్ ఉద్యోగులకు రీయింబర్స్‌మెంట్ సదుపాయం.
SMILE
30%
ఫోన్: 0861-2330949, 2344693

స్థాపకుడు: నెల్లూరు వెంకట్రామానాయుడు · స్థాపితం: 1930 · జీవప్రదాత: నెల్లూరు శ్రీరామమూర్తి
Longest Living Newspaper in Telugu Journalism

# జమీన్‌రైతు

సంపుటి: 80 • సంచిక: 39 • 11-9-2009 శుక్రవారం • పేజీలు: 16 • విడి ప్రతి: రూ.5/-

కేర్
సూపర్ స్పెషాలిటీ దంతవైద్యశాల
రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు మరియు రిటైర్డ్ ఉద్యోగుల ట్రీట్‌మెంట్‌కు అయ్యే ఖర్చును తిరిగి పొందే (రీయింబర్స్‌మెంట్) సదుపాయం కలదు.
డా॥ అబూరు స్వరూప్‌కుమార్‌రెడ్డి, MDS,
Asst. Professor Endodontics
పొగతోట, నెల్లూరు - ఫోన్ : 2303300

# అల్లరి చేసేకొద్దీ ఆలస్యం

రాష్ట్ర రాజకీయం కల్లోలంగా వుంది. ఈ క్షణమో, మరుక్షణమో పేలనున్న అగ్నిపర్వతం వలె కన్పడుతున్నది. వైఎస్.జగన్‌ను ముఖ్యమంత్రిగా ప్రకటించడంలో కాంగ్రెస్ అధిష్టానం ఆలస్యం చేసే కొద్దీ పరిస్థితులు వేడెక్కి పోతున్నాయి. పరిణామాలు ప్రమాదకరంగా మారుతున్నాయి.

వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ఇహ లోకాన్ని వీడి పదిరోజులు గడిచిపోయాయి. ఆయన మరణించిన పక్కరోజే, శవాన్ని కూడా గుర్తించకముందే, వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రి చేయాలని మంత్రులు, ఎమ్మెల్యేలు ఆందోళన మొదలు పెట్టారు. సంతకాలు సేకరించారు. రోజులు గడిచేకొద్దీ ఒత్తిడి పెంచుతున్నారు. జగన్‌ను కాదంటే పార్టీ చీలి పోతుందని ఒకరంటే, ప్రజలు తిరగబడతారని మరొకరు హెచ్చరిస్తున్నారు. వూరూరా ప్రదర్శనలు, ధర్నాలు నిర్వహిస్తున్నారు. జగన్



కనీసం మరొక వారం రోజులు ఈ నాన్పుడు వైఖరి ఇట్లనే కొనసాగవచ్చునని ఒక అంచనా. ఎమ్మెల్యేలు, మంత్రులు చేస్తున్న అల్లరి వల్లనే సోనియాతో సహా ఢిల్లీ పెద్దలందరూ ఈ విషయంలో ఒక నిర్ణయం తీసుకోవడానికి వెను

**అధిష్టానం ఆశీస్సులతోనే జగన్‌ను ముఖ్యమంత్రి కుర్చీలో కూర్చోపెట్టాలని కెవిపి రామచంద్రరావు తన రాజకీయ చాణక్యమంతా ప్రదర్శించి పావులు కదుపుతున్నారు.**

స్వంత పత్రిక సాక్షి ఈ ఆందోళనకు విశేష ప్రాధాన్యత ఇచ్చి ప్రచురిస్తున్నది. కథలు కథలుగా ప్రచారం చేస్తున్నది.

మరొకప్రక్క వైఎస్ ఆప్త మిత్రుడు కెవిపి. రామచంద్రరావు ఢిల్లీలో తన రాజకీయ చాణక్యమంతా ప్రదర్శిస్తున్నారు. ఎక్కే గడప దిగే గడపగా అందరి చుట్టూ తిరుగుతున్నాడు. జగన్‌ను సిఎం చేయడం ద్వారానే తన మిత్రుడి ఆత్మకు శాంతి చేకూరుతుందన్న ఆర్తితో ఆరాట పడుతున్నారాయన. ఇంకొకప్రక్క రాష్ట్రానికి చెందిన ఎమ్పీలు సోనియాగాంధీ మీద ఒత్తిడి తెస్తున్నారు. గుంపులు గుంపులుగా వెళ్లి ఆమెను కలిసి, తమ మాట కాదంటే పరిణామాలు చెయ్యిదాటి పోతాయని సున్నితంగా హెచ్చరికలు చేస్తున్నారు.

### మౌనముద్ర

అయితే ఎవరెంత గొంతు చించుకొన్నా అధిష్టానం మాత్రం మౌన ముద్ర వీడడం లేదు. ఔను అని చెప్పడం లేదు; కాదని తిరస్కరించడమూ లేదు. ఎటూ తేల్చడం లేదు. రోజులు గడిచిపోతున్నాయి. ఉత్కంఠ పెరిగిపోతున్నది. నరాలు చిట్లే టెన్షన్‌తో జబ్బున పడుతున్నారు కాంగ్రెస్‌వాదులు.

కాదుతున్నారనడం నిజం. కాంగ్రెస్ జాతీయపార్టీ. ఒక చోట తీసుకొనే నిర్ణయాల ప్రభావం అన్ని రాష్ట్రాల మీదా పడుతుంది. ముఖ్యమంత్రి పదవిని కుటుంబ వారసత్వ ఆస్తిగా మారిస్తే చాలా రాష్ట్రాలలో అదే పరిస్థితులు తలెత్త వచ్చునన్నది వారిని వేధిస్తున్న ఆందోళన. పార్టీని చీలుస్తామని, తిరుగుబాటు చేస్తామని బెదరించి, భయపెట్టి సాధించుకొన్నారన్న ప్రచారం జరిగితే, ప్రతి రాష్ట్రంలోనూ కల్లోలాలు చెలరేగుతాయేమోనన్నది మరొక సమస్య.

జగన్ పట్ల సోనియాగాంధీకి సానుభూతి లేదని భావించడానికి లేదు. ఆమె అభిమానాన్ని విశేషంగా సంపాదించుకొన్న రాష్ట్రస్థాయి నేతలలో వైఎస్.రాజశేఖర్‌రెడ్డి అగ్రగణ్యుడు. రాజకీయంగా, ఆర్థికంగా, విధేయత రూపంగా అధిష్టానానికి ఎంతో చేరువైనవాడాయన. అందువల్లనే ఏ రాష్ట్రంలోనూ లేని పద్ధతిలో పార్టీ మొత్తాన్ని ఆయన ఇష్టాఇష్టాలకు వదిలి పెట్టారు. ఆ అభిమానం ఆయనతోనే అంతరించి పోతుందనుకోలేము. ఆయన కుటుంబం పట్ల కూడా కొనసాగి తీరుతుంది. కానీ అందుకు రుజువు,

కొరవ 14వ పేజీలో



## మేకపాటి
## మహా చొరవ!

వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మరణానంతరం రాజకీయ పరిణామాలలో నెల్లూరు లోక్‌సభ సభ్యుడు మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రదర్శించిన చొరవ ప్రత్యేక గుర్తింపు పొందుతున్నది. రాజమోహన్‌రెడ్డి వివాదరహితుడైన రాజకీయవాది. తన పనేదో తానేదో అన్నట్లు వ్యవహరించడం ఆయన లక్షణం. 1985 నుంచి శాసన సభ్యుడిగా, పార్లమెంటు సభ్యుడిగా ఎన్నికౌతూ వస్తున్న ఆయన ఏ రోజు కూడా రాష్ట్ర రాజకీయ సంక్షోభాలలో తల దూర్చలేదు. ఏ ఒక్కరి పక్క నిలబడలేదు. కానీ ఇప్పుడు మాత్రం వైఎస్.జగన్ ముఖ్యమంత్రిత్వ ప్రయత్నాలలో మహా ఆసక్తి చూపుతున్నాడు. బహిరంగంగా తెరముందుకు వస్తున్నాడు. వైఎస్ చనిపోయాడన్న సమాచారం అందిన వెంటనే క్యాంప్ ఆఫీసుకు చేరుకొన్న రాజమోహన్‌రెడ్డి, ఆయన కుటుంబం పట్ల తన

కొరవ 14వ పేజీలో

## కార్టూన్ స్కేప్




ఇలాగయితే మీ సిఎం పదవీ కాలమంతా రోడ్లమీదే గడుస్తుంది సార్...!

## సాక్షికి నో ఎంట్రీ

కొత్త ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య కార్యాలయంలో తమకు నిరాదరణ ఎదురౌతున్నదని సాక్షి దినపత్రిక విలేకరులు వాపోతున్నారు. రోశయ్యను దించి, గద్దె మీద తాను కూర్చోవడానికి భూమ్యాకాశాలను ఏకం చేస్తున్న వైఎస్ జగన్ స్వంత పత్రిక ఇది. నిన్న మొన్నటి వరకు సాక్షి విలేకరి అంటే సిఎం పేషీలో కానీ, సెక్రటరియేట్‌లో కానీ పెద్ద పీట వేసేవారు. రోశయ్యతో సహా ఏ మంత్రి అయినా సరే, సాక్షి విలేకరిని చూస్తే ఉలిక్కి పడేవారు. అందులో ఏ వార్త వచ్చినా వైఎస్ దృష్టిలో పడుతుందనే భయమే అందుకు కారణం. ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. ప్రమాణస్వీకారం జరిగి వారం రోజులు దాటిపోయినా రోశయ్య సాక్షి పత్రికకు కానీ, టీవీ ఛానల్‌కు కానీ ఇంటర్వ్యూ ఇవ్వలేదు. పైపెచ్చు ఆయన సిబ్బంది సాక్షి విలేకరులను బయట కూర్చోబెట్టి, ఈనాడు, ఆంధ్రజ్యోతి విలేకరులను మాత్రం లోపలకు పంపుతున్నారు. ఆ అవమానం భరించలేక పోతున్నామని వారి ఆవేదన.

## సిఎల్పీ ఎవరు పెట్టాలి?

రాష్ట్రంలో ఎప్పుడూలేని రాజకీయ సంక్షోభం నెలకొనడంతో కొత్త కొత్త ప్రశ్నలు పుట్టుకొస్తున్నాయి. వాటిలో సిఎల్పీ సమావేశం ఎవరు ఏర్పాటు చేయాలి అన్నది ఒకటి. వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రిగా నియమించడానికి అధిష్టానం మీనమేషాలు లెక్కపెడుతుండడంతో, మనమే సిఎల్పీ సమావేశం జరిపించేద్దాం అని తొందరపడుతున్నారు ఎమ్మెల్యేలు. వారికా అధికారం లేదని జగన్ వ్యతిరేకులు వాదిస్తున్నారు. నాయకుడు లేని పరిస్థితులలో పిసిసి లేదా ఎఐసిసి పిలిస్తే తప్ప అధికారయుతంగా సిఎల్పీ జరిగినట్లు కాదని, నాయకుడి ఎన్నికకు గుర్తింపురాదని వీరి వాదన. మెజార్టీ ఎమ్మెల్యేలు కలిసి మీటింగ్ జరిపితే అది అధికారయుతం కాకుండా ఎట్లా పోతుందని జగన్ అనుయాయుల ఆగ్రహం.

సిఎల్పీ విషయంలో సాంప్రదాయాలు తప్ప నియమాలు లేవు. అందువల్ల ఎవరికివారు తమ వాదనే సరైనదని చెప్పుకొంటున్నారు.



ఫత్తేఖాన్‌పేటలో హత్యకు గురైన శీను (ఫైల్‌ఫోటో).

## నేరాల నెల్లూరు

నెల్లూరు నగరంలో నేరాలసంఖ్య పెరిగిపోతున్నది. గడచిన ఎనిమిది నెలల్లో నగరంలో పది హత్యలు, రెండు అత్యాచారాలు జరి గాయి. రెండు మూడేళ్లుగా స్తబ్దుగా వుండిన రౌడీ మూకలు మళ్లీ దందాను కొనసాగిస్తున్నాయి. జెండావీధి నగరంలో ఎక్కువ మంది రౌడీషీటర్లకు నిలయంగా మారడం ఆశ్చర్యపరుస్తుంది. ముస్లిం ప్రజానీకం ఎక్కువగా వుండే జెండావీధి, కోటమిట్ట, మన్సూర్‌నగర్, ఖుద్దూస్‌నగర్ ప్రాంతాల్లో ఆకు రౌడీలు పుట్టుకొస్తున్నారు. ఈ నేపథ్యంలో జరిగిన హత్యగా యాసిన్‌ది పేర్కొనవచ్చు. మూడు నెలల క్రితం శెట్టిగుంటరోడ్డులో శీను అనే వ్యక్తిని అతిదారుణంగా కత్తులతో నరికి చంపారు. పక్షం రోజుల క్రిందట ఫత్తేఖాన్‌పేటలో కార్పొరేటర్ పిండి సురేష్ అనుచరుడిని ఇదే ప్రాంతానికి చెందిన తిరంగా శ్రీనివాసులు హత్య చేశాడు. మూడు నెలల క్రిందట ఆత్మకూరు బస్టాండ్ ఎదుట వివాహిత కిడ్నాప్ అనంతరం సామూహిక అత్యాచారం, రెండవ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎనిమిదేళ్ల బాలికపై అత్యాచారం ఘటన నెల్లూరులో నేరాలు పెరుగుదలను స్పష్టపరుస్తున్నాయి. పోలీసుల్లో హుందాతనం తగ్గడంతో నేరగాళ్లకు అలుసైపోయారు. దీనిమూలంగా నేరగాళ్లు రెచ్చిపోతున్నారు.




## వైఎస్ జగన్‌ను సిఎం చేయాలి!

హెలికాప్టర్ ప్రమాదంలో మృతిచెందిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకొన్నారని కాంగ్రెస్ నాయకులు నివాళులు అర్పించారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో 6వ తేది సాయంత్రం ఇందిరాభవన్‌లో వైఎస్ సంతాపసభ జరిగింది. అధ్యక్షత వహించిన డిసిసి అధ్యక్షుడు గోపాలరెడ్డి వైఎస్ చేపట్టిన పలు పథకాలను వివరించి వాటి వలన ప్రజలకు ముఖ్యంగా పేదవారికి కల్గిన ప్రయోజనాలను వివరించారు. ఏ ముఖ్యమంత్రి చేయనన్ని పనులు ప్రజల కోసం వైఎస్ చేసి చూపించారన్నారు. పార్టీలకు అతీతంగా అందరు వైఎస్ రాజశేఖర్‌రెడ్డిని అభిమానించే వారని, ఆయన అంతిమయాత్రకు హాజరైన జనసందోహమే ఇందుకు నిదర్శనం అని మేయర్ భానుశ్రీ కొనియాడారు. ముస్లింల పిల్లల విద్య కోసం ఎన్నో కార్య క్రమాలు చేపట్టిన మానవతావాది రాజశేఖర్‌రెడ్డని కార్పొరేటర్ సందానిబాష నివాళు లర్పించారు. యువజన కాంగ్రెస్ రాష్ట్రకార్యదర్శి కర్తం ప్రతాప్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు కోటేశ్వరరెడ్డి, బాలసుధాకర్, మాజీ జి.ప ఛైర్మన్ చెంచల బాబు మాట్లాడుతూ జగన్‌ను ముఖ్యమంత్రిని చేసినపుడే వైఎస్ ఆశయాలకు అనుగుణంగా రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని అభిలషించారు.

# ఎర్రచందనం

## స్మగ్లింగ్‌కు వూపు!



జిల్లాలో ఎర్రచందనం స్మగ్లింగ్ మళ్లీ ఊపందుకొంది. అటు వెలిగొండ అడవులు ఇటు తిరుమల పరిసర ప్రాంతాల నుంచి యదేచ్ఛగా లారీల్లో ఎర్రచందనం సరిహద్దులు దాటి చెన్నై చేరుతోంది. నాలుగులైన్ల జాతీయ రహదారి ఎర్రచందనం స్మగ్లర్లకు స్వర్గధామంలా మారింది. వెంకటగిరి ప్రాంతం నుంచి తప్పించుకొన్న లారీలు తమిళనాడు చేరే వరకు తనిఖీ పాయింటే లేదు. తడ ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టులో స్మగ్లర్లు నెలమామూళ్లు ఇస్తుండడంతో వాళ్లు ఎర్రచందనం లారీల విషయమే పట్టించుకోవడం మానేశారు. వెంకటగిరి అటవీరేంజ్ పరిధిలో 22 బీట్లకు40 మంది సిబ్బంది మాత్రమే వుండడంతో స్మగ్లర్లను నియంత్రించలేకపోతున్నారు. ఎర్రచందనానికి విదేశీ మార్కెట్‌లో మంచి డిమాండ్ వుండడంతో వెలుగొండ, శేషాచలం కొండల్లోని చందనం చెట్లను స్మగ్లర్లు కొట్టేస్తున్నారు. భీమునివారిపాళెం చెక్‌పోస్టులో అటవీశాఖ సిబ్బంది ముగ్గురు వుండాల్సివుండగా ప్రతి రోజు ఒక్కరే డ్యూటీ చేస్తున్నారు. డ్యూటీ చేసే వ్యక్తికే స్మగ్లర్లు ఫోనుచేసి లారీని తప్పించే ఏర్పాట్లు చేసుకొంటున్నారు. ఎర్రచందనం స్మగ్లర్లను అణచివేయమని వున్నతస్థాయిలో ఎందుకు గట్టి నిర్ణయం తీసుకోవడంలేదో అర్థమే కావడం లేదు.

## రక్తంతో సంతకాలు



- జగన్‌ను సిఎం చేయాలని

వైఎస్ జగన్‌ను సిఎం చేయాలంటూ నెల్లూరు రాజీవ్ భవన్‌లో ఏర్పాటుచేసిన బ్యానర్‌పై కాంగ్రెస్ కార్యకర్తలు వేలాదిమంది 5,6 తేదుల్లో తమ రక్తంతో సంతకాలు చేశారు. ఈ బ్యానర్లను ఢిల్లీలోని ఎఐసిసి కార్యాలయానికి కొరియర్ ద్వారా పంపారు. ఈ కార్యక్రమం ముగింపు సందర్భంగా పిసిసి కార్యదర్శి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర రాజకీయాల్లో నూతన శకానికి నాంది పలికిన నేత రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఆయన అకాల మరణం తర్వాత ఏర్పడిన లోటును వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మాత్రమే భర్తీ చేయగలరన్నారు. సిటీ కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ పి.అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ వైఎస్‌లా ప్రజాభిమానం పొందిన నేత మళ్లీ పుడతారన్న నమ్మకం లేదన్నారు. ఆయన చనిపోయారని తెలిసి 450 మంది చనిపోయారంటే ఒక వ్యక్తి పట్ల పెంచుకొన్న నమ్మకానికి చిహ్నమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రణాళికా సంఘం సభ్యులు వైవి.రామిరెడ్డి, కార్పొరేటర్లు తాటి వెంకటేశ్వర్లు, నెల్లూరు మదన్‌మోహన్‌రెడ్డి, రూప్‌కుమార్, రాజీవ్‌భవన్ ఇన్‌ఛార్జ్ ముక్కు రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## బిఎస్ఎన్ఎల్ ఆఫర్ల వెల్లువ!

ఇది పండుగల సీజన్



బిఎస్ఎన్ఎల్ వినియోగదారులకు విస్తృతపరిధిలో సేవలు అందించేందుకు క్రొత్తక్రొత్త పథకాలను ప్రవేశపెడుతున్నట్లు టెలికాం జనరల్‌మేనేజర్ గోపి తెలిపారు. రంజాన్, దసరా పండుగల సందర్భంగా జాబిల్లి ప్లస్ పేరుతో లైఫ్ టైమ్ సిమ్‌కార్డును అందిస్తున్నట్లు వివరించారు. 40 రూపాయల సిమ్ ధర కల్గిన ఈ ప్లాన్‌లో 40 రూపాయల విలువ చేసే టాక్‌టైమ్ వుంటుందన్నారు. ఇందులో ప్రత్యేకత సెకనుకు ఒక పైసాగా పల్స్‌రేటు వుండటం అన్నారు. ఇప్పటివరకు సెకండ్సుపల్స్‌రేటు పెట్టిన ప్రైవేట్ ఆపరేటర్లు సైతం బిఎస్ఎన్ఎల్ సదుపాయాలు కల్పించడం లేదన్నారు. జాబిల్లి ప్లస్ స్కీంలో సిమ్ వినియోగదారుడు మరో 45 రూపాయలు పెట్టి స్పెషల్ టారిఫ్ ఓచర్ వేసుకొనాల్సి వుంటుందన్నారు. మొదటి 5000 మంది వినియోగదారులకే ఈ ఆఫర్ అన్నారు. ఇంటర్నెట్ సదుపాయాన్ని వినియోగించుకొనేవారికి నోవాసెట్ పిసిని అందజేస్తున్నట్లు తెలిపారు. పిసి అవసరం లేకుండా బ్రాడ్‌బ్యాండ్‌తో దీనిని పొందవచ్చున్నారు. తామే మోడెం, కీబోర్డు, మౌస్, మానిటర్‌లను ఇస్తామన్నారు. దీనికోసం గ్రామీణ ప్రాంత వినియోగదారులు 2259 రూపాయలు, పట్టణప్రాంతాల్లోని వారు 3891 రూపాయలు చెల్లించాలన్నారు. వీటితోపాటు టాప్‌అప్ రీఛార్జి కూపన్లపై 25 శాతం అదనపు టాక్‌టైం అందజేస్తున్నామన్నారు. ఈ ఆఫర్లన్నీ సెప్టెంబర్ 9 నుండి 16 వరకు మాత్రమేనని తెలిపారు.

# వైఎస్ హయాంలో నెల్లూరులో అభివృద్ధి పరవళ్లు!

**గతంలో ఏ ముఖ్యమంత్రి జిల్లాకు 34సార్లు రాలేదు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డిలా వివిధ అభివృద్ధి పథకాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు మరొకరు చేయలేదు.**



కృష్ణపట్నం థర్మల్ స్టేషన్ శంఖుస్థాపనోత్సవంలో సోనియాగాంధీతో వైఎస్. (ఫైల్ ఫోటో)



రాచర్లపాడులో కిసాన్‌సెజ్ శంకుస్థాపన కార్యక్రమంలో డాక్టర్ వైఎస్.రాజశేఖర్‌రెడ్డి. (ఫైల్ ఫోటో)

జిల్లాను అన్ని రంగాలలో అభివృద్ధి చేయడంలో దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్ రాజశేఖర్‌రెడ్డి చురుకైన పాత్ర పోషించారు. 2004 సంవత్సరంలో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వై.ఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ప్రమాదంలో మరణించే వరకు జిల్లాకు అనేక పథకాలు మంజూరు చేశారు. రాజశేఖర్‌రెడ్డి మరణించినప్పటికీ ఆయన శ్రీకారం చుట్టిన పథకాలను మాత్రం జిల్లా ప్రజలు ఎన్నటికి మరచిపోలేని విధంగా అమలు చేసిన ఘనత ఆయనకే దక్కుతుంది.



### వైఎస్ పథకాలు మరువలేనివి

జిల్లాలో వై.ఎస్ రాజశేఖర్‌రెడ్డి చేపట్టిన పథకాలు ఎప్పటికి మరచిపోలేనివి. ఇందిరమ్మ ఇళ్లు, 2రూపాయలకే కిలో బియ్యం పథకం, బిసి విద్యార్థులకు ఫీజులు రీయంబర్స్‌మెంటు ద్వారా ఎంతో మందికి లబ్దిచేకూరింది. ముఖ్యంగా జిల్లాను పారిశ్రామికంగా ముందుకు తీసుకెళ్లేందుకు ప్రత్యేక ఆర్థిక మండళ్ల ద్వారా పరిశ్రమల ఏర్పాటుకు శ్రీకారం చుట్టి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో కీలకపాత్ర పోషించారు.

*శ్రీనివాసులరెడ్డి, నెల్లూరు*



### ఇరిగేషన్ పనులకు శ్రీకారం

దివంగత రాష్ట్రముఖ్య మంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి జలయజ్ఞం ద్వారా జిల్లాలో అనేక ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణానికి శ్రీకారం చుట్టడం అభినందించదగిన విషయం. స్వర్ణముఖిబ్యారేజ్, సంగం బ్యారేజ్, పెన్నా వారధిపై బ్యారేజ్ నిర్మాణం తోపాటు అన్ని మండలాల్లోని చెరువులు, కాల్వల మరమ్మతులు, ఆధునీకరణ పనులకు కోట్లరూపాయల నిధులు మంజూరు చేసిన ఘనత ఆయనకు దక్కింది.

*పముజుల దశరథరామయ్య,*
*సిపిఐ జిల్లా కార్యదర్శి*



### రాజీవ్ ఆరోగ్యశ్రీ ప్రదాత

రాష్ట్రవ్యాప్తంగా పేద ప్రజలకు వైద్యం అందించేందుకు దివంగత ముఖ్య మంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి రాజీవ్ ఆరోగ్యశ్రీని ప్రవేశపెట్టి ప్రజల మనస్సుల్లో చిరస్థాయిగా నిలిచిపోయాడు. అలాగే ఇందిరమ్మ ఇళ్లు, నెల్లూరు నగర ప్రజల దాహార్తిని తీర్చేందుకు సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకు నిర్మాణం నిధులు మంజూరు చేసిన వ్యక్తి వైఎస్. జలయజ్ఞం పేరుతో అనేక ఇరిగేషన్ ప్రాజెక్టుల ఏర్పాటుకు ఎంతో కృషి చేసిన వ్యక్తి ఆయన.

*కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పిసిసి కార్యదర్శి*

## ఎన్నో అభివృద్ధి పథకాలు

ఇందిరమ్మ ఆదర్శగ్రామాలను ఎంపిక చేయడం, ఇందిరమ్మ పేరుతో పక్కా గృహాలు మంజూరు చేయడం, వృద్ధాప్య, వితంతు, వికలాంగుల పెన్షన్లు అదనంగా మంజూరు, రెండురూపాయలకే కిలో బియ్యం పథకం, రైతులకు ఉచిత విద్యుత్, అభయహస్తం తదితర పథకాలు అమలు చేయడంతోపాటు 75రూపాయల నుంచి 200 రూపాయల వరకు పెన్షన్లు పెంచడం జరిగింది. వికలాంగులకు తారతమ్యం లేకుండా 500 రూపాయలు అందజేసే ఏర్పాట్లు చేశారు వైఎస్. అలాగే జలయజ్ఞం పేరుతో జిల్లాలో ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్‌లు గతంలో మంజూరు చేసిన రుణాలను పూర్తిగా మాఫీ చేయడం, బ్యాంకుల నుంచి రైతులు తీసుకొన్న వ్యవసాయ రుణాలను మాఫీ చేయడం వంటి పథకాలు రైతుల మదిలో నిలిచిపోయాయి.

## ఇరిగేషన్‌కు పెద్దపీట

జిల్లాలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక నిధుల కేటాయింపు, ఇందిరప్రభ పేరుతో బీడు భూముల అభివృద్ధి, మైక్రోఇరిగేషన్ పథకం ద్వారా నీటివసతి ఏర్పాటు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం అమలు, రాజీవ్ ఆరోగ్యశ్రీ, 108, 104 ద్వారా వైద్య సేవలు తదితర పథకాలు జిల్లా ప్రజలకు ఎంతో లబ్దిచేకూర్చి పెట్టాయి. రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రమాదంలో మరణించే వరకు 36 సార్లు నెల్లూరు జిల్లా పర్యటనకు విచ్చేశారు. ఇన్నిసార్లు మరే ముఖ్యమంత్రి జిల్లాకు రాలేదు. జిల్లా పర్యటనకు వచ్చిన ప్రతిసారి ఏదోఒక పథకానికి శంకుస్థాపన లేదా ప్రారంభోత్సవం చేసేవారు.

ఎన్నో సంవత్సరాల తరబడి మరమ్మతులకు నోచుకోని చెరువులు, కాల్వలకు జలయజ్ఞం ద్వారా నిధులు కేటాయించి మరమ్మతులు, ఆధునీకరణ పనులు చేయించారు. సంగం బ్యారేజ్ నిర్మాణం, పెన్నావారధిపై బ్యారేజ్ కమ్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు విడుదల చేయడంతో ప్రస్తుతం వీటి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. మొత్తం జిల్లాలో జలయజ్ఞం ద్వారా 720కోట్ల రూపాయల పనులు మంజూరు చేశారు. వీటిలో చెరువులు, కాల్వలు మరమ్మతులు, ఆధునీకరణకు దాదాపు 172 కోట్ల రూపాయలు కేటాయించడం జరిగింది. మిగిలిన నిధులతో సోమశిల ప్రాజెక్టు ఆధునీకరణ, సంగం బ్యారేజ్ నిర్మాణం, పెన్నా వారధిపై బ్యారేజ్ కమ్ బ్రిడ్జి, వాకాడు వద్ద బ్యారేజ్ నిర్మాణానికి కేటాయించారు.

ప్యాకేజ్ నెం.35లో కృష్ణపట్నం, సర్వేపల్లి కాల్వలకు లైనింగ్ పనులు చేయడంతోపాటు సర్వేపల్లి రిజర్వాయర్ అభివృద్ధికోసం 90లక్షలు కేటాయించారు. పాతరోజుల్లో త్రవ్విన చెరువులు, కాల్వల వల్ల వ్యవసాయానికి ఎటువంటి ఇబ్బంది ఏర్పడకూడదన్న సంకల్పంతో జలయజ్ఞం ద్వారా వీటి ఆధునీకరణకు కోట్లరూపాయల నిధులు రాజశేఖర్‌రెడ్డి మంజూరు చేశారు. జిల్లాలో ఏ గ్రామానికి వెళ్లినా చెరువులు, కాల్వల నిర్మాణ పనులు జరుగుతుండడం కనిపిస్తుంది. కండలేరు జలాశయం ఏర్పాటు సమయంలో గ్రామాలను వదలి వచ్చిన ప్రజలకు దాదాపు 20 సంవత్సరాల నుంచి నష్టపరిహారం అందించడంలో సంబంధిత శాఖల అధికారులు పూర్తిగా విఫలం చెందారు.

ముంపు గ్రామాల ప్రజలకు నష్టపరిహారం చెల్లించని విషయం ముఖ్యమంత్రి దృష్టికి వెళ్లడంతో వెంటనే స్పందించిన ఆయన ముంపు గ్రామాల ప్రజలకు పక్కాగృహాల నిర్మాణం కోసం ఒక్కో కుటుంబానికి 50వేల రూపాయల వంతున పరిహారం మంజూరు చేసి ప్రజలకు అందే విధంగా ఆదేశాలు జారీ చేయడం జరిగింది. ఎన్నో సంవత్సరాల నుంచి ఎదురుచూసి ఇక నష్టపరిహారం అందదని దిగులుతో వున్న ముంపు గ్రామాల ప్రజలకు వై.ఎస్ రాజశేఖర్‌రెడ్డి తీసుకొన్న నిర్ణయంతో ఒక్కసారిగా వారి జీవితాల్లో అనూహ్య మార్పులొచ్చాయి.

## పావలా వడ్డీకి రుణాలు

జిల్లాలో స్వయం సహాయక సంఘాల ద్వారా పొదుపు చేసుకొంటున్న మహిళలు దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్ రాజశేఖర్‌రెడ్డిని దేవుడిగా పూజించుకుంటున్నారు. పొదుపు గ్రూపు మహిళలకు పావలావడ్డీకే రుణాలు అందించి వీరి ఆర్థికాభివృద్ధికి మరింత చేయూత నివ్వడం ఇందుకు నిదర్శనంగా చెప్పవచ్చు. బ్యాంకుల నుంచి పావలా వడ్డీకే రుణాలు మంజూరు చేయాలని తీర్మానించి అమలు చేయించడంతో నేడు గ్రామీణ ప్రాంత పొదుపు మహిళలు ఎంతో ఆర్థికంగా అభివృద్ధి చెందారు. ఈ పథకానికి శ్రీకారం చుట్టిన రాజశేఖర్‌రెడ్డి మరణించాడన్న వార్తను మహిళలు జీర్ణించుకోలేకపోతున్నారు.

## ప్రత్యేక ఆర్థిక మండళ్లు

నెల్లూరు జిల్లాను పారిశ్రామికంగా, ఆర్థికంగా ముందుకు తీసుకుపోవాలన్న లక్ష్యంతో ప్రత్యేక ఆర్థిక మండళ్ల ఏర్పాటుకు వైఎస్ శ్రీకారం చుట్టారు. ప్రత్యేక ఆర్థికమండళ్ల ఏర్పాటులో భాగంగా జిల్లాలో తొలిసారిగా తడ మండలం మాంబట్టు గ్రామాన్ని ఎంపిక చేసి అపాచీ బూట్ల తయారి ఫ్యాక్టరీకి అనుమతిని మంజూరు చేశారు. ప్రస్తుతం ఈ ఎస్ఇజడ్‌లో దాదాపు 3వేల మందిపైగా ఉపాధిపొందుతున్నారు. దీని తర్వాత చిల్లకూరు మండలం చింతవరం గ్రామ సమీపంలో మాస్‌హోల్డింగ్స్ లిమిటెడ్ సంస్థకు టెక్స్‌టైల్‌పార్కు ఏర్పాటుకు 2007 సంవత్సరంలో వై.ఎస్ శంకుస్థాపన కూడా చేయడం జరిగింది.

నాయుడుపేట మండలం మేనకూరు వద్ద 5వేల ఎకరాల్లో

కొరవ 15వ పేజీలో

▶ ఘనత వహించిన గ్రామంలో ఈ ఘోరాలేమిటి?

# అసాంఘిక కార్యక్రమాల అడ్డాగా బుచ్చి

బుచ్చిరెడ్డిపాళెంలో ఇటీవల కాలంలో అసాంఘిక కార్యకలాపాలు అధికమయ్యాయి. నిన్నమొన్నటివరకు ప్రశాంతంగా వుండే బుచ్చి ఇప్పుడు హైక్లాస్ వ్యభిచార కేంద్రాలకు, దొంగ నోట్ల పంపిణీకి కేంద్రంగా మారింది. ఈ రెండూ విచ్చలవిడిగా సాగుతున్నా ఏ అధికారి పట్టించుకోకపోవడంతో యువతీయువకులు పెడదారిపడుతున్నారు. సులభంగా డబ్బు సంపాదించేందుకు పై రెండు మార్గాలు అనువుగా వుండడంతో అధికసంఖ్యలో ఆ మార్గం పడుతున్నారు. వ్యభిచార కేంద్రాలు నిర్వహించే వారు హైటెక్ పద్ధతులను అవలంభిస్తున్నారు. కళాశాలకు వచ్చే యువతులు, పేద పిల్లలకు డబ్బు ఎరజూపి ఈ రొంపిలోకి దింపుతున్నారు. హైక్లాస్ జీవనానికి అలవాటు పడడంతో ఒకసారి దిగినవాళ్లు బయటకు రాలేకపోతున్నారు. అపార్టుమెంట్ సెంటర్, గాంధీనగర్, జొన్నవాడ రోడ్డు సెంటర్, పాత పోలీస్‌క్వార్టర్స్, పెద్దూరు, స్మశానం వద్ద వ్యభిచార కేంద్రాలు నడుస్తున్నాయి. దొంగనోట్ల ముఠా బుచ్చిపట్టణాన్ని కేంద్రంగా చేసుకొని వుందట. 500, 1000 రూపాయల నోట్లు ఇబ్బడిముబ్బడిగా మండలంలో చెలామణి అవుతున్నాయి. రాఘవరెడ్డి నగర్, శాంతినగర్ ప్రాంతాల్లో నోట్ల మార్పిడి జరుగుతున్నట్లు సమాచారం. పోలీసులు లంచాలు మరిగి వ్యభిచార కేంద్రాలు, దొంగనోట్లను అరికట్టేందుకు ముందుకు రాకపోవడంతో విచ్చలవిడితనం ఎక్కువైపోయింది.

# చెరువుకట్టను త్రవ్విపారేశారు

రోడ్డు పనులను చేబట్టిన కాంట్రాక్టర్ మట్టిని తోలి రోడ్డును వేయాల్సింది పోయి చెరువుకట్ట మట్టిని ప్రొక్లెయిన్‌తో తొలగించిన వైనం అల్లూరు మండలంలో చోటుచేసుకొంది. కోటి రూపాయల విలువైన ప్యాకేజి పనులను దక్కించుకొన్న కాంట్రాక్టర్ రోడ్డు మార్జిన్ ఎత్తు పెంచే పనులు ప్రారంభించాడు. దీనికోసం పల్లిపాడు నుంచి బుడ్డికాలువ వరకు గల చెరువు కట్టను జెసిబిలతో త్రవ్వించి ఆ మట్టితో రోడ్లు నిర్మిస్తున్నాడు. ఇది తెలుసుకొన్న రైతులు ఆందోళన చెందుతున్నారు. చెరువుకట్ట మట్టిని యంత్రాలతో తొలగించడంతో కట్ట తెగే ప్రమాదం వుందని ఆందోళన చెందుతున్నారు. దాదాపు 3లక్షల రూపాయల మేర చెరువు కట్టకు నష్టం సంభవించినట్లు రైతులు గుర్తించారు. దీనిపై ఆర్‌అండ్‌బి అధికార్లకు ఫిర్యాదు చేసినా వారు కనీసం స్పందించక పోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు మండల ప్రజలు. 20 గ్రామాలు, 25 వేల ఎకరాలకు చెరువు తెగితే ప్రమాదం ముంచుకొచ్చే పరిస్థితి. సంబంధిత కాంట్రాక్టర్ చేత తిరిగి చెరువు కట్టను పటిష్టపరచే చర్యలు ఆర్‌అండ్‌బి అధికారులు తీసుకోవాల్సి వుందని మండల ప్రజలు కోరుకొంటున్నారు.

# రిఫైనరీ పనులు అడ్డుకున్న గిరిజనులు

పంటపాళెంలో ఏర్పాటవుతున్న రిఫైనరి ప్రాజెక్టు పనులను గిరిజనులు అడ్డుకొన్నారు. తమకు నష్టపరిహారం చెల్లించేవరకు పనులు జరగనివ్వమని తేల్చిచెప్పారు. ఈ గ్రామంలో 24 గిరిజన కుటుంబాలు వున్నాయి. వీరికి 1978లో ఒక్కో ఎకరా భూమి ప్రభుత్వం కేటాయించింది. ఈ భూమిలో వేరుశనగను సాగు చేసిన వీరికి నష్టాలు రావడంతో కొందరు భూస్వాములు రంగప్రవేశం చేసి గిరిజనుల భూములను కౌలుకు తీసుకొన్నారు. మొదట కౌలుకు తీసుకొన్నా, తర్వాత కాలంలో వాటిని తమ స్వంతం చేసుకొనేందుకు పట్టాలు సృష్టించారు. రిఫైనరి ప్రాజెక్టు ఏర్పాటు కోసం ఆ భూములను స్వాధీనం చేసుకొన్న ప్రభుత్వం పరిహారాన్ని చెల్లించింది. పరిహారం నిజంగా ఆ భూములపై హక్కుదారైన తమకు కాకుండా కౌలుకు తీసుకొన్న భూస్వాములకు చెల్లించడంపై ఆగ్రహించిన గిరిజనులు ఆందోళనకు దిగారు. స్థానిక ఉప సర్పంచ్ విజయకుమార్, నాగరాజు, బాలస్వామి తదితరుల ఆధ్వర్యంలో పనులను అడ్డుకొన్నారు. న్యాయం జరిగే వరకు పనులు జరగనివ్వమని భీష్మించారు గిరిజనులు.

## ఖజానా అధికార్లకు డైరక్టరేట్ మొట్టికాయ

నెల్లూరు కెవిసి కళాశాలలో పనిచేసే పార్టు టైం లెక్చరర్ల జీతాల చెల్లింపులో జిల్లా ట్రెజరీ అధికార్లు అర్థంపర్థంలేని అభ్యంతరాలతో కాలయాపన చేస్తూ వచ్చారు. కెవిసి కళాశాలలో యుడిసిగా పనిచేస్తూ ఎసిబికి పట్టుబడి సస్పెండైన యుడిసి లోకేశ్వరరావు ఈ కార్యాలయంలో కూర్చొని అధికార్లను లోగట్టుకొని వారిచేత బిల్లులపై అభ్యంతరాలు చెప్పి ఇబ్బంది పెట్టేవాడు. తన కేసు విత్‌డ్రా కోసం లెక్చరర్లపై ఒత్తిడి తేవడం కోసం ఈ తతంగం చేసేవాడు. ఈ క్రమంలో ఇద్దరు చిన్న పిల్లలతో తంటాలుపడుతూ తనకు జీతం చెల్లించమని లెక్చరర్ పి.శేషమణి జిల్లా ట్రెజరీ అధికారిణి గీతాదేవిని వేడుకొంది. స్థానిక ఎమ్మెల్యేలు, మీడియా ప్రతినిధులు ఆమెకు చెప్పినా రెటమతంగా బిల్లులను పాస్ చేయకుండా అభ్యంతరాలు తెల్పింది. దీంతో గత్యంతరం లేని లెక్చరర్ శేషమణి ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం, విద్యార్థి సంఘాల ప్రతినిధుల ద్వారా డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ ఆఫీసర్ ఎన్.సి.నాగార్జునరెడ్డికి విజ్ఞప్తి చేసింది. ఆయన నిశితంగా పరిశీలించి మెమో నెం.ఎం.ఎస్.12973/2009 ఉత్తర్వుతో జిల్లా ట్రెజరీ అధికార్లకు జీతాలు వెంటనే చెల్లించమని ఆదేశాలిచ్చారు. ఈ మందలింపుతోనైనా ట్రెజరీ అధికార్లలో కాస్త మార్పు వస్తుందేమో వేచిచూడాలి.

## ఇసుక కుంభకోణంలో జిల్లావాసి

కృష్ణాజిల్లాలో పంచాయతీ అధికారిగా పనిచేసిన ఇందుకూరుపేట పల్లిపాడు గ్రామానికి చెందిన శనగా సుబ్రహ్మణ్యం ఇసుక సీనరేజ్ పనులలో అడ్డగోలుగా దాదాపు కోటిముప్పై లక్షలు ముడుపులు స్వీకరించి జాతీయ బ్యాంకులో డిపాజిట్ చేసినట్లు ఆలస్యంగా తెలిసింది. విజయవాడ గవర్నర్‌పేట పోలీసులకు ఫిర్యాదు అందడంతో ఈ వ్యవహారమై కూపీలాగుతున్నారు. నెల్లూరుజిల్లాతో పాటు మరికొన్ని జిల్లాల్లో ఈయనకు డిపాజిట్లు, ఆస్తులున్నట్లు తెలుస్తుంది. పల్లెపాడులో చిన్నకాపురం పెట్టి సంసారం చేయడంతోపాటు ఇతర లక్షణాలూ ఉన్నట్లు తెలుస్తుంది. ఇతడిని పోలీసులు అరెస్ట్‌చేశారు. లోతుపాతు విషయాలు విచారణలో వెల్లడి కావాల్సి వుంది. విషయం తెలుసుకున్న ఇందుకూరుపేట వాసులు సుబ్రహ్మణ్యం ఉదంతాన్ని కథలు కథలుగా చెప్పుకొంటున్నారు.


సత్యంజీ గ్రూప్
రియల్ ఎస్టేట్స్ & రిసార్ట్స్

ఇప్పటి వరకు మేము నెల్లూరులో వేసిన మా వెంచర్స్
మీరు ఖచ్చితంగా గమనించే ఉంటారు.
అందరూ... మాకున్న ప్రత్యేకతనూ చూసే ఉంటారు.

కొంత మంది అనుకోవచ్చు ... ఏమిటి ఇలా చేస్తున్నాడు?
నిజంగా ఇక్కడ ఇంత అవసరమా? భవిష్యత్ ఉంటుందా? అని!
ఇది నగ్న 'సత్యం' మన జిల్లా పారిశ్రామికంగా ఎవ్వరూ ఊహించని స్థాయికి ఎదుగుతోంది. ఆరోజు.. ఎంతో దూరంలో లేదు. బాగా అయితే 5 సం॥లోపే. అన్ని ప్రాజెక్టులు పూర్తిస్థాయిలో రన్నింగ్‌లోకి వస్తాయి.
అప్పుడు తెలుస్తుంది. ఈ సత్యం చెప్పినది నగ్న సత్యమని.

**నన్ను నమ్మండి. ఇంతకంటే ముందు 'భూమి' ని నమ్మండి.**
**మీ బంగారు భవిష్యత్తు.. మీ నిర్ణయంతో...**

ఇప్పటివరకు చేసింది. మీరు చూసింది. గోరంతే...

మెగా రిసార్ట్స్ వలె ఉండే
సత్యంజీ నగర్ A1
అందమైన ప్రపంచం...

(నెల్లూరు ఎన్.హెచ్.5 నుండి కేవలం 3 కి.మీ దూరంలో వావిలేటిపాడు), ధనలక్ష్మీపురం, ముత్తుకూరురోడ్డు.
లో చేయబోయేది కొండంత.. కనీవినీ ఎరుగనంత. ఇంకెప్పటికీ.. ఎవ్వరూ చేయలేనంత.

**అభివృద్ధిని సగర్వంగా చేసి చూపిస్తున్నాం. కాల పరిస్థితిని మీరు చూస్తున్నారు.**
**కాసేపు ఆలోచించండి.. రండి.. మొదట చూడండి. నచ్చితేనే మీ సొంతం చేసుకోండి.**

**గతంలో ప్లాటు కొనలేకపోయాము అనుకునే వారికి ఇది మరో సువర్ణ అవకాశం**
ఈ క్రొత్త వెంచర్‌లో డెవలప్ చేసే కొద్దీ ప్రతి ప్లాటుకు కంపెనీ రెండు లక్షల రూపాయలు ఖచ్చితంగా పెంచుతుందని తేది 23-8-09, 30-8-09 పత్రికల ద్వారా తెలిపాము. అప్పటి నుంచి ఇప్పటికే మొదటి 102 ప్లాట్లలో 50 ప్లాట్లు అమ్మాము. మిగిలిన 52 ప్లాట్ల వరకే ఈ అవకాశం.
**తరువాత రెండు లక్షల రూపాయలు ఎక్కువ పెట్టామని చింతించాల్సి ఉంటుంది.**

మీ.. **సత్యంజీ**

**సత్యంజీ ల్యాండ్ డెవలపర్స్ & బిల్డర్స్**
ముత్తుకూరు రోడ్డు, ఆంధ్రాబ్యాంకు ప్రక్కన, హరనాథపురం, నెల్లూరు - 3.
సెల్ : 99494 12959, ఫోన్: 3295633, 9247066382, 92470 73001.
www.satyamglanddevelopers.com e-mail : satyamg_nlr@yahoo.co.in

## ఇదేంది దొర!



గుంటూరు రేంజ్ ఐజిగా కిషోర్ కుమార్ ఇటీవల బాధ్యతలు తీసుకొన్నారు. కిషోర్ కుమార్‌కు పోలీస్ శాఖలోనూ బయట మంచి అధికారిగా పేరుంది. 27తేది నుంచి జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లను తనిఖీ చేస్తున్నారాయన. నాలుగైదు స్టేషన్లలో రికార్డుల పరిశీలన తర్వాత జిల్లాలో శాంతిభద్రతలు భేష్ అని ఐజి ప్రకటించడం అందర్నీ ఆశ్చర్యపర్చింది. ఈ మధ్య నెల్లూరు నగరంలో ఓ వివాహితను పోకిరీలు తీసుకెళ్లి గ్యాంగ్‌రేప్ చేశారు. జిల్లాలో మహిళలపై యాసిడ్ దాడులు జరిగాయి. హత్యలు, కొట్లాటల పరంపర కొనసాగుతోంది. వీటన్నింటిని ఐజి పరిగణనలోకి ఎందుకు తీసుకోలేదో పరిశీలకులకు అర్ధమే కావడంలేదు. దీనికితోడు జిల్లాలో అక్రమ కలెక్షన్లలో నెం.1 స్టేషన్ అయిన నెల్లూరు టూ టౌన్ పోలీస్ స్టేషన్‌ను ఐజి బ్రహ్మాండమనడంతో పోలీసుశాఖలోనే భిన్నస్వరాలు వినిపిస్తున్నాయి.

## పప్పులుడక నివ్వరు

నెల్లూరుజిల్లా అధికారులు ప్రతి ప్రభుత్వ పథకాన్ని బ్రహ్మాండంగా ప్రారంభిస్తారు. ఆ తర్వాత అవి అమలయ్యే తీరే పట్టించుకోక పోవడం వల్ల ఆ పథకాలు ప్రజలకు ఏమాత్రం ఉపయోగపడడం లేదు. జాయింట్ కలెక్టర్ సౌరభ్ గౌర్ నెల్లూరులో పప్పులమ్మే ట్రేడర్లతో మాట్లాడి జిల్లాలోని రైతుబజార్ల ద్వారా కందిపప్పు కేజీ65, పెసర పప్పు 55, మినపప్పు 50 రూపాయ లకు అమ్మిస్తానన్నారు. నాలుగు రోజులు పై రేట్లకు అమ్మిన ట్రేడర్లు ఐదవ రోజు ఈ కౌంటర్లు మూసేశారు. ఈ విషయం పరిశీలించని జెసి ఇప్పుడు మళ్లీ పచ్చిశనగ పప్పు కేజి 30, బఠాణీలు 20 రూపాయలకు రైతుబజార్ల ద్వారా అమ్మిస్తానంటున్నారు. మహిళలు మాత్రం జిల్లా అధికారులపై కస్సుబుస్సు లాడుతున్నారు. అందుబాటు ధరల్లో పప్పులు అమ్మించి వాటిని పొయ్యిపై ఉడికేట్లు చేయమంటున్నారు.



## కాంగ్రెస్ కార్యకర్తల ఉద్యోగాలు పోయాయి



ప్రతినెల 1తేదికి వెయ్యి రూపాయలు జీత మిచ్చే ఆదర్శ రైతుల వుద్యోగాలతో జిల్లాలోని కాంగ్రెస్ కార్యకర్తలకు చిల్లర ఖర్చులకు ఇబ్బంది లేకుండా వుండేది. కాని గత నెలలో జరిగిన జడ్పీ సమావేశంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన సర్పంచుల భార్యలు, సైకిల్‌షాపులు నిర్వహించే, ఎల్‌ఐసి ఏజంట్లుగా వ్యవహరించే కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఆదర్శ రైతులుగా పని చేస్తున్నారని విపక్షం తెలుగుదేశం నిలదీసింది. దీంతో జిల్లా వ్యవసాయాధికారి బాలయ్యకు గొంతులో పచ్చి వెలక్కాయపడింది. మొత్తం మీద ఆయన రకరకాల శోధన తర్వాత 800 మంది కాంగ్రెస్ కార్యకర్తలను అనామక రైతులపేరిట తొలగించివేయడం చర్చనీయాంశమయ్యింది.

## రాజన్న రికార్డు!

పురుషులలో పుణ్యపురుషులు వేరన్నట్లు ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి వున్న జనాభిమానం ఆయన మరణం తర్వాత జిల్లాలో అందరికీ తెలియవచ్చిందనాలి. వైఎస్ మరణించారని టివీలో స్క్రోలింగ్ వచ్చిందే తడవు సింహపురి స్తంభించిపోయింది. ఇంట్లో మనిషి చనిపోయినట్లు జనం తల్లడిల్లారు. రాష్ట్రంలో మరే జిల్లాలో పర్యటించనట్లుగా ఆయన 34సార్లు జిల్లాకు వచ్చిన విషయాన్ని జనం మననం చేసుకొన్నారు. జిల్లా ప్రజాప్రతినిధులు నోరు తెరచి అడిగిన పథకాలు, తన దృష్టికి వచ్చిన వాటిని ఆయన నెరవేర్చారు. జిల్లాలో ప్రజల్లో ఆయన పట్ల వున్న అభిమానానికి జరిగిన సంతాప సభలను కొలమానంగా చెప్పుకోవచ్చు. రాజశేఖర్‌రెడ్డి అంత్యక్రియలు పూర్తయిన మరుసటి రోజు నుంచి మూడు రోజుల్లోనే జిల్లా వ్యాప్తంగా వెయ్యికిపైగా సంతాప సభలు జరిపి రాజశేఖర్‌రెడ్డి పట్ల జనం హృదిలో గూడుకట్టుకొన్న అభిమానాన్ని వెల్లడి చేశాయి. జయహో రాజశేఖరా...



## వీడో శాడిస్ట్

శాడిస్టులు పలు రకాలు. వీరిబారినపడిన వారు తప్ప ఈ వెధవాయిలు పెట్టే బాధలు వర్ణించనలవి కావు. నెల్లూరు నగరంలో ఓ విలక్షణ శాడిస్ట్‌ను టూటౌన్ పోలీసులు అదుపులో తీసుకొన్నారు. స్టోన్‌హౌస్‌పేటకు చెందిన దంపతులు నగరంలోని చిన్నపిల్లల పార్కుకు వాకింగ్‌కు వెళ్లేవారు. ఇక్కడో అపరిచిత శాడిస్ట్ ఈ దంపతులను ప్రతిరోజూ పలకరించేవాడు. ఒక మాసం గడిచాక మొన్నో రోజు ఈ శాడిస్ట్ వీరి ఇల్లు కనుక్కొనిమరీ వెళ్లాడు. ఆ ఇల్లాలు మర్యాదకోసం కాఫీ కూడా ఇచ్చిందట. ఇంతలో ఇతను మాయమైపోయాడు. వెళ్లిపోయాడని ఆ ఇల్లాలు భావించింది. కానీ వారి బెడ్‌రూంలో మంచం క్రింద చేరిన ఈ శాడిస్ట్ ఆమె భర్త వచ్చాక బట్ట లూడదీసుకొని బయటకు వచ్చాడట. ఈ భర్త మంచివాడు.... మర్యాదస్తుడు కావడంతో శాడిస్ట్‌కు నాలుగు తగిలించి పోలీసులకు అప్పగించాడు. నగరంలోని మరో రెండు పోలీస్‌స్టేషన్లలోనూ ఈ శాడిస్ట్ విపరీత చేష్టలపై ఫిర్యాదులు అందాయట. సో.... అపరిచిత వ్యక్తుల పట్ల నడకకెళ్లేవారు జాగ్రత్తగా వుండకుంటే కాపురాలు కూలుతాయి సుమా!






## అశ్రునయనాలతో...

పేదలపాలిటి పెన్నిధి...
పేద మధ్యతరగతి ప్రజల శ్రేయస్సే ధ్యేయంగా
పరిశ్రమలు స్థాపించి, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో
నడిపించిన ముఖ్యమంత్రి ఇకలేరని... మేము ఊహించలేము.
మీ వంటి ముఖ్యమంత్రి కలలోగాని, ఇలలో గాని ఇక రారు.
పదికోట్ల మంది గుండె చప్పుడు మీరు.
భౌతికంగా మీరు మా మధ్య లేకున్నా...
ప్రజల హృదయాలలో చిరస్థాయిగా కొలువై ఉంటారు.
మీ ఆత్మకు శాంతిని చేకూర్చమని భగవంతుడిని ప్రార్థిస్తూ...
ఈ దు:ఖ సమయంలో వారి కుటుంబ సభ్యులకు
మా ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలియజేస్తూ...

యాజమాన్యం మరియు సిబ్బంది
KRISHNAPATNAM PORT COMPANY LTD.
Nellore, AP. India



# 46వ డివిజన్‌ను మరచిన కార్పొరేటర్!

మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని 46వ డివిజన్ అనాథగా మిగిలిపోయింది. స్థానిక కార్పొరేటర్ గాని, కార్పొరేషన్ అధికారులు గాని ఈ డివిజన్‌లోని సమస్యల గురించి పట్టించుకోవడం లేదు. దినసరి కూలి చేసుకొని జీవించే వారు ఈ డివిజన్‌లో ఎక్కువగా నివశిస్తున్నారు. వీరంతా అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతూ ఎవరికి విన్నవించుకొన్నా ప్రయోజనం లేకుండా పోయిందని వాపోతున్నారు. ఇళ్లస్థలాలు, పక్కాఇళ్లు, పెన్షన్లు ఈ ప్రాంతవాసులకు కొద్దిమందికి మాత్రమే ఇస్తున్నారు. ఇంకా అనేక మంది అర్హులున్నప్పటికీ వారికి మంజూరు కావడం లేదు.

ఈ డివిజన్ కార్పొరేటర్‌గా తెలుగుదేశం పార్టీ తరపున కొణిదల మునివెంకట సుధీర్ 2005 సంవత్సరంలో జరిగిన కార్పొరేషన్ ఎన్నికలలో గెలుపొందారు. తెలుగుదేశం పార్టీ తరపున గెలిచినప్పటికి ఆనం వర్గంతో సన్నిహితంగా వుండేవాడు. తెలుగుదేశం పార్టీ తరపున నిర్వహించే కార్యక్రమాలలో కూడా ఎక్కువగా పాల్గొనేవాడు కాదు. కార్పొరేటర్‌గా గెలిచిన తర్వాత డివిజన్ సమస్యలపై దృష్టిసారించి పనులు చేపట్టడంలో పూర్తిగా వైఫల్యం చెందాడు. ఆతర్వాత చిరంజీవి స్థాపించిన ప్రజారాజ్యంపార్టీ తీర్థం పుచ్చుకొని డివిజన్‌ను, ఓట్లేసి గెలిపించిన ప్రజలను పూర్తిగా మరచిపోయాడు.



**సమస్యలు బోలెడు!**

అనేక సమస్యలతో ఇబ్బంది పడుతున్నాం. త్రాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, మురికి కాల్వలు లేక దుర్భరజీవితం గడుపుతున్నాం. పొర్లుకట్ట ప్రాంతంలో అనేక మందికి ఇళ్ల స్థలాలు లేవు. ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు డివిజన్‌లోని సమస్యలపై దృష్టి పెట్టాలి

శైలజ



**ఇళ్ల స్థలాలు కేటాయించాలి!**

డివిజన్‌లో నివాసం వుంటున్నవారు ఇళ్ల స్థలాలు లేక ఇబ్బంది పడుతున్నారు. కార్పొరేటర్‌కు, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా ప్రయోజనం లేకుండా పోయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలి.

–షేక్ అజీజ్

డివిజన్ పరిధిలో సంతపేట కొంత భాగం, పొర్లుకట్ట, ఈద్గామిట్ట, మునిసిపల్ కార్పొరేషన్ వెనుకవైపు భాగం తదితర ప్రాంతాలున్నాయి. కార్పొరేటర్‌గా ఎన్నికై దాదాపు నాలుగు సంవత్సరాలు పూర్తయినా డివిజన్‌లో ఎటువంటి అభివృద్ధి పనులు చేపట్టిన దాఖలాలు కనిపించడం లేదు. మిగిలిన డివిజన్లలో పనులు జరుగుతున్నా తమ డివిజన్‌లో అభివృద్ధి కానరావడం లేదంటూ ఇక్కడ ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కార్పొరేటర్ డివిజన్‌లో పర్యటించి సంవత్సరాలు గడచిపోయాయని అంటున్నారు. కార్పొరేటర్ వ్యవహారం కూడా డివిజన్ ప్రజలతో ఇక సంబంధం లేదన్న విధంగా వుంది. ప్రజారాజ్యం పార్టీ కార్యక్రమాలు, స్వంత వ్యాపారాలు నిర్వహించుకొనేందుకే అధిక సమయం కేటాయిస్తున్నాడు. ఈ క్రమంలో డివిజన్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై స్థానికులు వెల్లడించిన అభిప్రాయాలను ప్రక్కనిస్తున్నాం.



వీధులలో పేరుకపోయిన చెత్తాచెదారం.



ఫ్లాట్‌ఫాం పూర్తిగా దెబ్బతిన్న వీధికాలాయి.

అవినీతి కథ

# ఈ - సేవా కేంద్రంలోనూ అవినీతి!




నెల్లూరులోని ఈ-సేవ కార్యాలయం.

వినియోగదారులకు, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఈ-సేవా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగింది. వివిధ ప్రభుత్వశాఖలకు చెల్లించాల్సిన పన్నులు, విద్యుత్ బిల్లులు, టెలిఫోన్ బిల్లులు, రవాణాశాఖకు చెల్లించే జరిమానాలను సైతం ఈ-సేవా కేంద్రంలో చెల్లిస్తుంటారు. ఈ కేంద్రాలు ఇటీవల కాలంలో అనేక అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నాయి. ఈ-సేవా కేంద్రాల నిర్వహణపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ, తనిఖీలు నిర్వహించడంలో వైఫల్యం చెందడం వలన ఇక్కడ విధులు నిర్వహించే సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు.

ఇటీవల కళాశాలలు, పాఠశాలలో చదివే విద్యార్థిని విద్యార్థులకు కుల, ఆదాయం, నివాసం ధృవీకరణ పత్రాలను సకాలంలో జారీ చేయాలన్న లక్ష్యంతో వీటి బాధ్యతలను రెవెన్యూ అధికారులు ఈ-సేవా కేంద్రాలకు అప్పగించారు. ధృవీకరణ పత్రాలు అవసరమైన వారు ఈ-సేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకొని 25 రూపాయలు ఫీజు చెల్లిస్తే మండల తహశీల్దార్ చేత సంతకాలు చేయించి మరుసటిరోజు ధృవీకరణపత్రాలు అందజేసే విధంగా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అయితే ఇక్కడ సిబ్బంది విద్యార్థుల అవసరాలను ఆసరాగా చేసుకొని మరింత చేతివాటం ప్రదర్శిస్తున్నారు.

> “ విద్యార్థులకు అవసరమైన కుల, ఆదాయ, నివాస ధృవీకరణ పత్రాల తక్షణ మంజూరుకు పైకమడుగుతున్నారు. ”

మండల తహశీల్దార్ ప్రతిరోజు సాయంత్రం ఈ-సేవా కేంద్రానికి వెళ్లి ధృవీకరణ పత్రాలపై సంతకాలు చేయాలి. కార్యాలయాల్లో పనిభారం అధికం కావడంతో ఈ-సేవా కేంద్రాలకు వెళ్లలేకపోతున్నారు. విద్యార్థులు ఏదైనా కౌన్సిలింగ్‌కు వెళ్లాలనుకుంటే ఈ-సేవా కేంద్రాల సిబ్బందికి 100 రూపాయలు అదనంగా సమర్పించుకుంటే నేరుగా తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లి సంతకాలు చేయించుకొని తీసుకవస్తున్నారు. అదనంగా మామూళ్లు సమర్పించుకోలేని విద్యార్థులకు మాత్రం ధృవీకరణ పత్రాలు సకాలంలో అందడం లేదు. సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా కౌన్సిలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులకు కష్టాలు తప్పడం లేదు.

ఈ-సేవా కేంద్రాల సిబ్బంది అవినీతి అక్రమాల కారణంగా ప్రభుత్వ లక్ష్యం, సంకల్పం పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఏర్పడింది. అలాగే వివిధ పనుల నిమిత్తం ఈ కేంద్రాలకు వెళ్లే వినియోగదారులకు సరైన సమాధానం చెప్పకపోవడం వలన కొన్ని సందర్భాలలో వాగ్వివాదాలు చోటు చేసుకొంటున్నాయి. సిబ్బంది సరైన సమయానికి కేంద్రానికి రాకపోవడం, వున్న సిబ్బంది సెల్‌ఫోన్లలో సన్నిహితులతో నిత్యం మాట్లాడుకోవడం వలన ఇక్కడ నిర్వహించే కార్యకలాపాలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. వీటి నిర్వహణ గురించి ఎవరైనా వినియోగదారుడు ప్రశ్నిస్తే దురుసు సమాధానం చెబుతుంటారు.

ఈ-సేవా కేంద్రం సకాలంలో పనులు పూర్తికాక వినియోగదారులు ఇబ్బంది పడుతున్నా పట్టించుకునే దిక్కులేకుండా పోయారు. విధినిర్వహణ అలసత్వం ప్రదర్శిస్తున్న సిబ్బంది పట్ల ఫిర్యాదు చేసేందుకు కూడా ఇక్కడ అధికారి ఎప్పుడూ అందుబాటులో వుండడం లేదనేది వినియోగదారుల ఆరోపణ. వినియోగదారులకు పనులు పూర్తికాకపోవడం వలన రోజురోజుకు ఇక్కడకు వచ్చేవారి సంఖ్య తగ్గిపోతుంది. విద్యార్థులకు అందజేసే కుల, ఆదాయం, నివాస ధృవీకరణ పత్రాల జారీ విషయంలో చేతివాటం ప్రదర్శిస్తున్న సిబ్బంది ఇతర పనులలో మరెలా వ్యవహరిస్తారో వూహించుకోవచ్చు.

ఈ-సేవా కేంద్రాల పనితీరు, సిబ్బంది అవినీతి అక్రమాల పట్ల ఉన్నతాధికారుల పర్యవేక్షణ చేయాల్సిన అవసరం ఏర్పడింది. లేకుంటే ఈ కేంద్రాలు పూర్తిగా నిర్వీర్యం అయ్యే ప్రమాదం వుంది.

## అలస్యం

మొదటి పేజీ కొరవ

జగన్‌కు ముఖ్యమంత్రిత్వం ఇవ్వడం మాత్రమే అనే ధోరణి మాత్రం సోనియాగాంధీ అంగీకరించక పోవచ్చునన్నది పరిశీలకుల ఊహ.

### ప్రస్తుతానికి పెండింగ్

మహారాష్ట్ర, హర్యానా రాష్ట్రాలలో జరుగుతున్న ఎన్నికలు ముగిసేవరకు జగన్ వివాదాన్ని పెండింగ్‌లో పెట్టాలన్నది ఢిల్లీ అభిమతమని చెప్తున్నారు. అంతవరకు రోశయ్యనే ముఖ్యమంత్రిగా కొనసాగించాలన్నది వారి ఆలోచన అట. అయితే అన్నిరోజులు ఆగడానికి అటు జగన్ కానీ, ఇటు ఎమ్మెల్యేలు కానీ సిద్ధంగా లేరు. ఏ మాత్రం ఆలస్యాన్ని సహించేస్థితిలో వారు లేరు. రోశయ్యను ముఖ్యమంత్రిగా గుర్తించడానికి, గౌరవించడానికి మంత్రులే ఇష్టపడడం లేదు. రఘువీరారెడ్డి, జూపల్లి కృష్ణారావు, దానం నాగేందర్ వంటి మంత్రులు రోశయ్య జరిపే సమావేశాలకు హాజరు కావడం లేదు. ఆయన ఆదేశాలను లక్ష్య పెట్టడం లేదు.

విచిత్రమైన పరిస్థితి ఇది. కాంగ్రెస్ చరిత్రలో ఇటువంటి పరిస్థితి ఎప్పుడూ లేదు. అధిష్ఠానం ఇట్లనే నాన్పుడు వైఖరి అవలంభిస్తే, వీరేమి చేస్తారన్నది ఆసక్తి కల్గించే అంశం. చాలా వాదనలు వెలుగులోకి వస్తున్నాయి. తిరుగుబాటు చేసి పార్టీని చీల్చాలని కొందరు, అసలు శాసనసభనే రద్దు చేయించాలని మరికొందరు మాట్లాడుతున్నారు. పార్టీ చీలిక చట్టం ప్రకారం సాధ్యం కాదు. శాసనసభ రద్దు పరిస్థితిని మెజార్టీ ఎమ్మెల్యేలు కోరుకోవడం లేదు. ఎంతో ప్రయాసపడి గెల్చుకొన్న ఎమ్మెల్యే పదవిని ఆరు నెలలో పోగొట్టుకోవడానికి ఎవరికి మనసు ఒప్పుతుంది? అధిష్ఠానంతో సంబంధం లేకుండా సిఎల్పీ సమావేశం జరిపి, జగన్‌ను నాయకుడిగా ఎన్నుకోవాలని కొందరి ఆలోచన. కానీ అధిష్ఠానం అనుమతి లేకుండా జరిపే సిఎల్పీని గవర్నర్ గుర్తించకపోవచ్చునని న్యాయనిపుణులు చెప్తున్నారు. విప్ జారీ చేయడం ద్వారా ఆ సమావేశానికి ఎమ్మెల్యేల హాజరును నివారించే అవకాశం వుంది. ఒకవేళ రాజశేఖర్‌రెడ్డి అనుచరులైన విప్‌లు అందుకు సహకరించరనుకొంటే రాత్రికి రాత్రి వారిని ఆ పదవుల నుంచి తొలగించి కొత్త వారిని పెట్టే అధికారం పార్టీకి వుంది.

ఇంతకూ జగన్ కోసం పార్టీని ధిక్కరించడానికి సిద్ధపడే ఎమ్మెల్యేల సంఖ్య ఎంత అన్నది ఒక చర్చ. ఈసారి శాసనసభలో కాంగ్రెస్‌పక్షంగా 47 మంది మొదటిసారి ఎన్నికైనవారున్నారు. వీరందరికీ రాజకీయాలు తెలియవు. కాంగ్రెస్ పద్ధతులు తెలియవు. అధిష్ఠానం అంటే తెలియదు. వారి శక్తి తెలియదు. రాజశేఖర్‌రెడ్డి టిక్కెట్ ఇస్తే, పోటీ చేసి గెలిచారు. ఆయన కుటుంబం కోసం ఎంత అల్లరికైనా సిద్ధపడుతున్నారు. పాత ఎమ్మెల్యేలలో కూడా చాలామంది రాజశేఖర్‌రెడ్డికి వీరవిధేయులు. మంత్రులలో సగం మంది ఆ కోవకే వస్తారు. జగన్ కోసం తమ మంత్రిత్వాన్ని వదులుకోవడానికి వారు వెనుకాడక పోవచ్చు. మరొకప్రక్క వైఎస్ వల్ల ఆర్థికంగా లాభపడినవారున్నారు. పూటకు గతిలేని వారిని కోట్లకు పడగలెత్తేట్లు చేశాడాయన. అటువంటి వారిలోనూ కృతజ్ఞత పెల్లుబుకుతున్నది.

మొత్తం మీద 70 నుంచి 100 మంది వరకు జగన్ ముఖ్యమంత్రిత్వం కోసం అల్లరికి దిగుతున్నారని అంచనా. ఇంతమందిని కాదను కొని అధిష్ఠానం నిర్ణయం తీసుకోగలదా? ఒకవేళ తీసుకొన్నా, వీరి సహాయ నిరాకరణతో ప్రభుత్వాన్ని నడపడం సాధ్యమా? వీరి అల్లరిని ఆపేందుకు అధిష్ఠానం వద్ద వున్న ఆయుధాలు ఏమిటి?

ఏది ఏమైనా జగన్‌ను ముఖ్యమంత్రిగా ప్రకటించకుంటే, ఒకటి రెండు రోజులలోనే రాష్ట్రం రాజకీయ సంక్షోభంలో కూరుక పోవడం ఖాయమని అందరి అభిప్రాయం. ఈ ఒత్తిడిని ఎంతో కాలం తట్టుకొని నిలవడం సాధ్యం కాక పోవచ్చు.

కెవిపి రామచంద్రరావు మాత్రం, సాధ్యమైనంత వరకు అధిష్ఠానం ఆశీస్సులతోనే తన ఆప్తమిత్రుడి కుమారుడికి అధికారం అప్ప చెప్పాలని తాపత్రయపడుతున్నాడు. ఏ కారణం చేత అయినా కాంగ్రెస్ పార్టీకి దూరమైతే, జగన్ రాజకీయ భవిష్యత్తు దెబ్బతింటుందన్నది ఆయన ఆందోళన. పార్టీ అండ లేకుండా ఆంధ్రప్రదేశ్‌లో ఎవరూ రాజకీయ ఉన్నతి సాధించలేరని గతంలో పలుమార్లు రుజువైంది. అందువల్ల ఢిల్లీ పెద్దల మనసు కరిగే వరకు తొందరపడవద్దని జగన్ అభిమానులు వేడుకొంటున్నారు.



నెల్లూరు విఆర్ కాలేజి మైదానంలో జరిగిన ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సంతాపసభలో మాట్లాడుతున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి. వేదికపై అన్ని పార్టీల నేతలున్నారు.

## మేకపాటి

మొదటి పేజీ కొరవ

విధేయత చాటుకోవడానికి జగన్ ముఖ్యమంత్రిత్వానికి మద్దతు తెలుపుతూ ఎమ్మెల్యేల చేత సంతకాలు చేయించే బాధ్యతలో పాలుపంచుకొన్నాడు. కందుకూరు ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి వంటి వారి వద్దకు తానే స్వయంగా వెళ్లి సంతకం పెట్టించాడు. లేక్‌వ్యూ అతిథి గృహంలో ఎమ్పీల సమావేశ నిర్వహణ తన భుజాల మీద వేసుకొన్నాడు. ఆ తర్వాత ఢిల్లీలో కూడా కాంగ్రెస్ అగ్ర నేతల వద్ద ఎమ్పీల మనోభావాలు వెల్లడించే కార్యక్రమాన్ని దగ్గరుండి జరిపించాడు.

మేకపాటిలోని ఈ చొరవ కాంగ్రెస్‌వాదులనే ఆశ్చర్యపరచింది. ఎమ్పీలందరూ ఈ అంశాన్ని విశేషంగా చర్చించుకొంటున్నారు. నెల్లూరు లోక్‌సభ నుంచి పోటీ చేయడానికి తనకు టిక్కెట్ ఇప్పించడంతోపాటు, వ్యాపారపరంగా కూడా వైఎస్ చేసిన సహాయానికి ఈ రూపంలో కృతజ్ఞత చెల్లించినట్లున్నాడు రాజమోహన్‌రెడ్డి.

## చందన బాబా మరణం



నెల్లూరు చందనా బ్రదర్స్, సిఎంఆర్ షాపింగ్ మాల్ అధిపతి మావూరి సత్యనారాయణ (బాబా) 6వ తేది మరణించారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండినారాయన. ఆయన వయస్సు 62 సంవత్సరాలు.

బాబాది ఈ వూరు కాదు. వ్యాపారం కోసం వచ్చినవాడు మాత్రమే. కానీ, నెల్లూరు నగర ప్రజలలో ఒకడుగా కలిసిపోయాడు. పరాయివాడన్న భావనే కలిగేది కాదు. చాలా సరదా మనిషి. అమాయకత్వంతో కూడిన మాటలతో అందరికీ స్నేహపాత్రుడిగా మెలిగేవాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు వున్నారు. వారి కుటుంబానికి మా సానుభూతి తెలియజేస్తున్నాము.

## నెల్లూరుముచ్చట్లు

3వ పేజీ కొరవ

మాకులేనిది ఆయనకు ఎందుకో అంత ప్రేమని కాంగ్రెస్ కౌన్సిలర్లు చెవులు కొరుక్కున్నారు.

### మదర్ థెరిస్సా వర్ధంతి

సేవామూర్తి మదర్ థెరిస్సా 13వ వర్ధంతిని నెల్లూరు జిల్లా పవన్‌కళ్యాణ్ ఫ్యాన్స్ 5వ తేది నెల్లూరులో ఘనంగా జరిపారు. ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.టోని నగరంలోని భిక్షగాళ్లకు, కుష్టు రోగులకు, వృద్ధులకు దుప్పట్లు, భోజన పొట్లాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పవన్‌కళ్యాణ్ అభిమానులు సాయి, అశోక్, వాసు, మధు, చైతు, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

### ఆకట్టుకొన్న ఆ నలుగురు!

8వ తేది నెల్లూరు కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన వైఎస్ సంతాపసభలో అందరి కంటే ఆ నలుగురు కార్పొరేటర్లు మాత్రం అందరినీ ఆకట్టుకొన్నారు. వారు మునిసిపల్ ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ టిక్కెట్‌పై పోటీచేసి గెలిచిన సుధీర్, కిన్నెర ప్రసాద్, బద్రి మంజుల, సాయిలలిత. సుధీర్ టిడిపి నుంచి ప్రజారాజ్యం పార్టీలో చేరగా, బద్రి మంజుల మేయర్ ఎన్నికల నుంచి కాంగ్రెస్‌తో జత కట్టింది. కిన్నెర ప్రసాద్ ఈ మధ్య కాంగ్రెస్ పార్టీలో చేరాడు. ఇటీవల జరిగిన డివిజన్ కమిటీ ఎన్నికలలో సాయిలలిత కాంగ్రెస్ వారి సహకారంతో ఆ పదవి దక్కించుకొంది.

### అంతర్జాతీయ సదస్సుకు విద్యానగర్ వాసులు!

విద్యానగర్ ఎన్‌బికెఆర్ ఆర్ట్స్ కాలేజి రిటైర్డ్ లెక్చరర్ రాజారత్నం కుమారుడు, తిరుపతిలోని అనంత న్యాయకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.డి. విజయశేఖర్, కోడలు ఎస్వీయూనివర్సిటీలో న్యాయశాస్త్ర ప్రొఫెసర్ వి.హేమలతాదేవి యూరప్‌లోని పోలెండ్, స్వీడన్ దేశాల పర్యటనకు 11వ తేది బయలుదేరుతున్నారు. పోలెండ్‌లోని జాగిలోనియన్ యూనివర్సిటీలో నిర్వహించే అంతర్జాతీయ పర్యావరణ సదస్సులో పాల్గొని న్యాయశాస్త్ర పరిశోధనా పత్రాలను సమర్పిస్తారు.

### పార్లపల్లి సునీతమ్మ మరణం

నెల్లూరు ఆర్అండ్‌బి శాఖలో ఇఇగా పని చేసి దివంగతులైన పార్లపల్లి చంద్రశేఖర్‌రెడ్డి సతీమణి సునీతమ్మ(65) అమెరికాలోని టెక్సాస్‌లో 8వ తేది మరణించారు. ఆమె కుమారుడు సునీల్ కుమార్‌రెడ్డి పేరుగాంచిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. కుమార్తె డాక్టర్ సుధ క్యాన్సర్ స్పెషలిస్ట్. రామ్మూర్తి నగర్‌లో మమతా నర్సింగ్‌హోమ్ అధినేత బద్దెవోలు శ్రీహరిరెడ్డికి సునీతమ్మ స్వయాన చెల్లెలు. ఆత్మీయురాలిని కోల్పోయిన వీరి కుటుంబానికి మా సానుభూతి.



అల్లీపురం గ్రామంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి నివాళులర్పిస్తున్న పొక్కిరెడ్డి నిరంజన్‌కుమార్‌రెడ్డి, నెల్లూరు పవన్‌కుమార్‌రెడ్డి, పొక్కిరెడ్డి రాజేంద్రకుమార్‌రెడ్డి, ప్రసన్నరెడ్డి తదితరులు

# రిజర్వేషన్ బిల్లుతో మహిళాభ్యుదయం!



మహిళాభ్యుదయం దిశగా కేంద్ర ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసి కీలక నిర్ణయం తీసుకొంది. పంచాయతీ పదవుల్లో మహిళలకు రిజర్వేషన్‌ను 50 శాతం పెంచాలనే ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. ప్రధాని మన్మోహన్‌సింగ్ అధ్యక్షతన గత వారం ఢిల్లీలో జరిగిన కేంద్రమంత్రి వర్గ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకొన్నారు. దీని కోసం రాజ్యాంగంలో 243 (డి) అధికరణను సవరిస్తూ బిల్లు తీసుకరావాలని మంత్రి వర్గం తీర్మానించింది. దీని ద్వారా ప్రస్తుతం వున్న మూడవవంతు నుంచి 50శాతం మహిళలకు ప్రాతినిధ్యం పెరగనుంది. ప్రత్యక్ష ఎన్నికల ద్వారా భర్తీ అయ్యే మొత్తం సీట్లకు ఈ పెంపు అమలు కానుంది. ఇప్పటికే బీహార్, ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్‌లో 50శాతం రిజర్వేషన్ అమలవుతున్నది. నాగాలాండ్, మేఘాలయ, మిజోరాంతోపాటు అస్సాం, త్రిపురలోని గిరిజన ప్రాంతాలు, మణిపూర్‌లోని పర్వత ప్రాంతాలలో మాత్రం ఇది వర్తించదు. ఈ బిల్లును వచ్చే పార్లమెంటు సమావేశాల్లో పంచాయతీరాజ్ మంత్రిత్వశాఖ ప్రవేశపెట్టనుంది. ఈ బిల్లును ఆమోదిస్తే గ్రామ పాలనలో మహిళల సంఖ్య పెరుగుతుంది. జిల్లాకు సంబంధించి దీనికి అనుగుణంగా పలు స్థానాల్లో మహిళల ప్రాతినిధ్యం అధికం కానుంది. 961 పంచాయతీలు, 599 ఎంపిటిసి, 46 జడ్పీటిసిలతోపాటు నెల్లూరు మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో 50, గూడూరు, కావలి, వెంకటగిరి మునిసిపాలిటీలలో 33, 37, 25 మంది కౌన్సిలర్లు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 961 పంచాయతీల్లో 11వేల మంది వార్డు సభ్యులు వున్నారు. వీటన్నిటిలో 50 శాతం మహిళా రిజర్వేషన్ అమలయితే మహిళల సంఖ్య దానికి అనుగుణంగా పెరగనుంది. మహిళలకు సంబంధించి వారి పాత్రను పెంచేలా కేంద్ర ప్రభుత్వం తీసుకొన్న నిర్ణయంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నా నిధులు, విధులు కేటాయింపు కచ్చితంగా అమలు చేయాలని కోరుకొంటున్నారు. వారి అభిప్రాయాలు దిగువనిస్తున్నాం.



### శుభసూచకం

మహిళలకు స్థానిక సంస్థలలో 50 శాతం రిజర్వేషన్ కల్పించే దిశగా కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ సవరణ ద్వారా పార్లమెంటు ఆమోదం పొందాలనుకోవడం శుభసూచకం. ఈ బిల్లు వలన మహిళలు మరింతగా చైతన్యవంతులయ్యేందుకు అవకాశం వుంది. పలు అంశాలలో అవగాహన కల్గించుకొని విస్తృతంగా పురుషులకంటే మిన్నగా మహిళలు తమ శక్తియుక్తులు చాటేందుకు ఇదొక మంచి అవకాశం. అందుకు తగినట్లు నిధులు, విధులు కేటాయింపు సక్రమంగా జరగాలి.

**రాళ్లపాక అనూరాధ, టిడిపి**



### మంచి పరిణామం

మహిళలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్‌ను 50 శాతం కల్పించేలా కేంద్ర మంత్రి వర్గం ఆమోదం తెలపడం మంచి పరిణామం. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే పలు సంక్షేమ, ప్రజాకర్షక పథకాలను ప్రవేశపెట్టి ప్రజల మనసు చూరగొన్నది. అలాంటిది మహిళల గౌరవాన్ని మరింత ఇనుమడించేలా 50శాతం రిజర్వేషన్ అమలు చేయాలనుకోవడం హర్షదాయకం.

**పందిళ్లపల్లి అరుణమ్మ, కాంగ్రెస్**



జిల్లా పరిషత్ ప్రత్యేక సమావేశంలో ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, ఆయన ముఖ్యకార్యదర్శి సుబ్రహ్మణ్యం చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న జడ్పీ ఛైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ఆదాల ప్రభాకర్‌రెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, పరసా రత్నం తదితరులు.

# వైఎస్ పేదజన పక్షపాతి!



రాష్ట్ర ప్రజలపై చెరగని ముద్రవేసిన ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హఠాత్తుగా హెలికాప్టర్ ప్రమాదంలో దుర్మరణం చెందడం ప్రజలందరిని కలిచివేసింది. నిన్న మొన్నటి వరకు చెరగని చిరునవ్వుతో వుంటూ పేదలకోసం, రైతులకోసం అహర్నిశలు కృషిచేసిన ముఖ్యమంత్రి ఊహించని విధంగా తిరిగిరాని లోకాలకు వెళ్లడం రాష్ట్ర ప్రజలతోపాటు, దేశం యావత్తుకు కోలుకోలేని విషాదాన్ని మిగిల్చింది. కాంగ్రెస్ పార్టీలో తిరుగులేని నేతగా వున్న ఆయన పాదయాత్రతో జైత్రయాత్ర చేసి రెండుసార్లు రాష్ట్ర ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించారు. గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా, ప్రవేశపెట్టని విధంగా ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఘనత రాజశేఖర్‌రెడ్డిది. ప్రజలందరికి మంచి ఆరోగ్యం అందించాలని, పేదలు కార్పొరేట్ వైద్యాన్ని ఉచితంగా పొందాలన్న ఆశయంతో ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టారు. అది పేదలపాలిట అపర సంజీవనిలా పని చేసింది. రైతులకు ఉచితవిద్యుత్, రుణమాఫీ, మహిళలకు పావలావడ్డీకి రుణాలు, రెండురూపాయలకే కిలో బియ్యం, పెన్షన్లు, ముస్లిం విద్యార్థులకు ఫీజు రాయితీ తదితర ఎన్నో బృహత్తర పథకాలకు శ్రీకారం చుట్టారు. రైతుల కష్టాలు తీర్చాలని, రాష్ట్రంలోని అన్ని భూములను సస్యశ్యామలం చేయాలని ఆయన తలపెట్టిన జలయజ్ఞం దేశంలోనే అతిపెద్ద కార్యక్రమంగా చెప్పుకొంటారు. క్రొత్తగా రచ్చబండ కార్యక్రమాన్ని రూపొందించుకొని దాని ద్వారా నేరుగా ప్రజలతో మాట్లాడి ప్రభుత్వ ఫలాలు ఎలా అందుతున్నాయో తెలుసుకొనేందుకు హెలికాప్టర్‌లో ప్రయాణమైన ఆయన ప్రజలను దుఃఖసాగరంలో ముంచి తిరిగిరాని లోకాలకు వెళ్లాడు. ఆ వార్త విని దాదాపు 500 మంది మృతిచెందారంటే ఆయన ఎంతగా ప్రజల హృదయాల్లో సుస్థిరస్థానం సంపాదించుకొన్నాడో తెలుస్తుంది. ఆయన మరణం తర్వాత సామాన్యులను కదిలిస్తే వారి స్పందనిలా వుంది.



### ప్రాణభిక్ష పెట్టాడు!

దివంగత ముఖ్యమంత్రి వైఎస్. రాజశేఖర్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ పథకం వలన ఎంతో మంది ప్రాణాలకు రక్షణ లభించింది. గుండె జబ్బుతో బాధపడుతున్న నేను లక్షలు పెట్టి ఆపరేషన్ చేయించుకొనే స్థోమత లేక ప్రాణాలపై ఆశ వదిలేసుకొన్న సమయంలో ఆ మహానుభావుడు ఆరోగ్యశ్రీ ద్వారా నా ప్రాణం నిలబెట్టాడు. రూపాయి ఖర్చు లేకుండా గుండె ఆపరేషన్ చేయించుకొని ఇలా మాట్లాడగల్గుతున్నానంటే అంతా ఆయన దయ.

**వాన్‌బాషా, నెల్లూరు**



### పేదలకు ఆప్తుడు

వైఎస్.రాజశేఖర్‌రెడ్డి పేదల కోసం ఎన్నో మంచిపనులు చేపట్టిన మహనీయుడు. ఆయన చేసినట్లు పేదలను ఆదుకొనేందుకు మరెవ్వరూ ఇన్ని కార్యక్రమాలు చేపట్టలేదు. మహిళలు, రైతుల కోసం రాజశేఖర్‌రెడ్డి చేపట్టిన పథకాలు జీవితాంతం ఆయన్ను గుర్తుండిపోయేలా చేస్తాయి.

**రాజమ్మ,నెల్లూరు**



### ప్రజా నాయకుడు

వైఎస్.రాజశేఖర్‌రెడ్డి నిజమైన ప్రజానాయకుడు. పేదల పక్షపాతి. గతంలో ఏ ముఖ్యమంత్రి చేపట్టని విధంగా కిలో రెండు రూపాయలకు బియ్యం, ఉచితవిద్యుత్, ఆరోగ్యశ్రీ, వృద్ధాప్య వితంతు, వికలాంగుల పింఛన్లు, పావలావడ్డీకి రుణాలు అందజేసి పేదలను ఆదుకొన్న ఒకేఒక్క నాయకుడు వైఎస్.రాజశేఖర్‌రెడ్డి. ఆయన లేడంటే నమ్మలేకపోతున్నాం.

**ఏకాంబరం, నెల్లూరు**

## వైఎస్ హయాం

5వ పేజీ కొరవ

మరో పరిశ్రమ ఏర్పాటుకు వై.ఎస్ గత సంవత్సరం శంకుస్థాపన చేశారు. అలాగే చిల్లకూరు మండలం అంకులపాటూరు వద్ద 2వేల ఎకరాల్లో ఎస్.బి.క్యూ ఉక్కు పరిశ్రమను ఈ నెల 2వ తేదిన ప్రారంభించాల్సిన వైఎస్ అదేరోజు హెలికాప్టర్ ప్రమాదంలో మరణించారు. కొడవలూరు మండలం రాచర్లపాడు వద్ద వెయ్యి ఎకరాల్లో మరో వ్యవసాయ సెజ్‌కు గత సంవత్సరం వై.ఎస్ శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం ఈ సెజ్‌లో పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ముత్తుకూరు మండలంలో కృష్ణపట్నం పోర్టుకు గత సంవత్సరం సోనియాగాంధీని తీసుకు వచ్చి ప్రారంభించిన విషయం అందరికీ తెలిసిందే. ఇదే మండలంలో రిలయన్స్ కంపెనీ, జెన్‌కోల ఆధ్వర్యంలో రెండు అల్ట్రామెగా థర్మల్ విద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు జరిగి పనులు జరుగుతున్నాయి. ఈ ప్రాజెక్టులన్నీ వైఎస్. రాజశేఖర్‌రెడ్డి మంజూరు చేసినవి. ఇరిగేషన్ ప్రాజెక్టులపరంగా తీసుకొంటే జిల్లాలో 1700కోట్ల రూపాయల పనులను వైఎస్.రాజశేఖర్‌రెడ్డి మంజూరు చేశారు. పరిశ్రమలపరంగా చూసుకొంటే 55వేల కోట్ల రూపాయల పైబడి మంజూరయ్యాయి. పై ప్రాజెక్టులు పూర్తిస్థాయిలో నిర్మాణం జరిగితే స్థానికులకు ఉపాధి అవకాశాలు దొరుకుతాయి. అభివృద్ధి పథకాలు, సంక్షేమ పథకాలు ఎన్నో మంజూరు చేసిన వైఎస్‌ను జిల్లా ప్రజలు కల కాలం గుర్తుంచుకొంటారు.

Regn.No. : RN 1156 / 57
J/Nellore/008/09-11

## రోశయ్య సర్కారు

# రాజ్యాంగబద్ధమేనా?



రాష్ట్ర ముఖ్యమంత్రిని, ఆయన సలహా మీద మంత్రి మండలిని నియమించే అధికారాన్ని రాజ్యాంగం గవర్నర్లకు అప్ప చెప్పింది. అయితే అందుకు కొన్ని నియమాలు లేదా సాంప్రదాయాలు వున్నాయి. ముఖ్యమంత్రిగా వ్యవహరించడానికి ముందుకు వచ్చే నాయకుడిని శాసనసభలో మెజార్టీ వుందో లేదో నిర్ధారించుకోవాలి. సంబంధిత రాజకీయ పార్టీ నుంచి లేఖ లేదా దానికి సంబంధించిన లెజిస్లేచర్ పార్టీ తీర్మానం తీసుకోవాలి. ఇవి రెండూ లేనప్పుడు, సమర్థించే ఎమ్మెల్యేల జాబితా కోరాలి. ఎమ్మెల్యేల జాబితా ప్రకారం ముఖ్యమంత్రి ఎంపిక జరిగినప్పుడు, శాసనసభలో విశ్వాస పరీక్ష ఎదుర్కొని బలం నిరూపించుకోవాలని ఆదేశించాలి. అందుకు నిర్దిష్టమైన గడువు విధించాలి.

రోశయ్య విషయంలో గవర్నర్ ఎన్‌డి.తివారి ఈ సాంప్రదాయాలు వేటినీ పాటించలేదు. రాజశేఖరరెడ్డి హఠాత్ మరణంతో ఏర్పడిన విపత్కర, విషాద పరిస్థితులలో రాజ్యాంగ నియమాలను పరిశీలించే సావధానం ఆయనకు లేకుండా పోయాయి. అటు పిసిసి, ఎఐసిసిల నుంచి కానీ, ఇటు సిఎల్పీ నుంచి ఎటువంటి అధీకృత తీర్మానం లేకుండానే రోశయ్య నేరుగా రాజ్‌భవన్‌కు వెళ్లి ప్రమాణ స్వీకారం చేశాడు. ఆయనకు ఎమ్మెల్యేల బలం వుందా లేదా అన్న పరిశీలన జరపకుండానే గవర్నర్ ఆ లాంఛనం జరిపించాడు. కనీసం ఆ తర్వాత అయినా విశ్వాస పరీక్షలో బలనిరూపణ చేయమని రోశయ్యను ఆదేశించి వుంటే గవర్నర్ చర్య ఆక్షేపణకు గురయ్యేది కాదు. కానీ ఆ సంగతి మర్చిపోయారాయన.

### పరీక్ష పెడితే ఓటమి?

ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలో పరిస్థితులు మారిపోయాయి. రోశయ్య విశ్వాసపరీక్ష కోసం శాసనసభలో తీర్మానం పెడితే, ఆయన్ను ఓడించడానికి కాంగ్రెస్ సభ్యులే సిద్ధంగా వున్నారు. అందువల్ల ఇప్పట్లో ఆయన ఆ సాహసానికి పూనుకోలేదు.

అటువంటప్పుడు రోశయ్యకు ముఖ్యమంత్రిగా కొనసాగే అధికారం, రాజ్యాంగం ప్రకారం వుంటుందా అన్నది పెద్ద ప్రశ్న. ఎవరైనా న్యాయస్థానంలో ఆయన ప్రభుత్వ రాజ్యాంగబద్ధతను సవాలు చేస్తే చాలా సమస్యలు తప్పవు. ముఖ్యమంత్రుల ఎంపికలో గవర్నర్ల పాత్ర గురించి సుప్రీంకోర్టు లెక్కలేనన్ని తీర్పులు వెలువరించి వుంది. వాటిలో ఏ ఒక్కటీ మన గవర్నర్ చర్యను సమర్థించే పరిస్థితి కన్పించడం లేదు. అసలే రాజకీయ సంక్షోభంతో సతమతమౌతున్న కాంగ్రెస్ అధిష్టానానికి ఈ రాజ్యాంగ సంక్షోభం పెద్ద తలనొప్పి తెచ్చి పెట్టడం ఖాయంగా కన్పిస్తున్నది.

## సిఎల్పీ నివాళి లేదా?

రాష్ట్ర కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీకి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి పదేళ్లపాటు నాయకుడిగా కొనసాగారు. ఇంత సుదీర్ఘ కాలం, అంతరాయం లేకుండా ఈ పెద్దరికం వహించినవారు మరొకరులేరు. కానీ ఆయన మరణించి పదిరోజులు కావస్తున్నా సిఎల్పీ సమావేశం ఏర్పాటు చేసి నివాళి అర్పించే పరిస్థితి లేకుండా పోయింది. సిఎల్పీ సమావేశం పిలిస్తే ఎమ్మెల్యేలు సంతాపం సంగతి పక్కనపెట్టి, తమ కొత్త నాయకుడిగా వైఎస్.జగన్‌ను ఎన్నుకొన్నట్లు తీర్మానం చేస్తారనే భయంతో కాంగ్రెస్ అగ్రనాయకత్వం ఆ జోలికి వెళ్లడం లేదు. శాసనసభ విషయంలో కూడా జాప్యానికి ఇదే కారణం. ప్రస్తుత ముఖ్యమంత్రి హఠాత్తుగా మరణించినప్పుడు శాసనసభను ప్రత్యేకంగా సమావేశపరచి, సంతాపం తెలపడం కనీస ధర్మం. కానీ అందుకు కూడా కాంగ్రెస్ పార్టీ సాహసించలేక పోతున్నది. అక్కడా అదే సమస్య. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రోశయ్య మీద అవిశ్వాసం ప్రకటించే తీర్మానం ప్రవేశ పెడతారని భయం.

రాష్ట్రంలో కాంగ్రెస్‌ను ఒక ప్రాంతీయ పార్టీగా మార్చి, తన సంపూర్ణ అధికారాన్ని దీనిపై సాధించాడు వైఎస్. కానీ ఆయన మరణంతో ఆ ఘనత ఆవిరైపోయింది. రాజకీయాలలో ఈ రోజుకు ఎవరు రాజో, ఎవరు మంత్రో చెప్పలేమనేది అందుకే.

# అందరిలో విరహ వేదన

వైఎస్.రాజశేఖర్‌రెడ్డి మరణించి ఈ వార్త వ్రాసే సమయానికి సరిగ్గా వారం రోజులు. ఆయన మరణ వార్త పట్ల రాష్ట్రంలో పెల్లుబుకిన సానుభూతి ఉధృతి, సాధారణ ప్రజలు కూడా కంటతడి పెట్టిన తీరు చూస్తే, ఆయన జ్ఞాపకాలు చాలా కాలం పాటు మనసులను వెన్నంటి వుంటాయనే భావన కల్గింది. కానీ ఆ బాధ సగటు మనిషికే తప్ప కాంగ్రెస్‌వాదులకు కాదేమో అన్పిస్తున్నది నడుస్తున్న పరిణామాలను చూస్తుంటే. కాంగ్రెస్ నాయకులంతా వైఎస్ మరణం వల్ల కల్గిన వియోగాన్ని మరిచిపోయారు. వైఎస్.జగన్‌కు పదవి ఇంకా రాలేదన్న విరహంతో వేగిపోతున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్పీలు అందరిది ఒకటే ధోరణి. సగం మంది ఎమ్మెల్యేలు, ఎమ్పీలు కనీసం తమ తమ వూళ్లలో వైఎస్ సంతాప సభలు పెట్టాలన్న లాంఛనం కూడా పాటించడం లేదు. దానికంటే వైఎస్.జగన్ ముఖ్యమంత్రిత్వం కోసం అల్లరి ముఖ్యమనుకొంటున్నారు. మంత్రులు నిర్వహిస్తున్న సంతాప సభలలో వైఎస్ బొమ్మల కంటే, జగన్ ఫోటోలే ఎక్కువ దర్శనమిస్తున్నాయి. ఉపన్యాసాలలో సైతం వైఎస్‌తో తమకున్న అనుబంధం, రాష్ట్రానికి వైఎస్ చేసిన సేవలకంటే అధికంగా జగన్ ముఖ్యమంత్రి కావాల్సిన అవసరానికే ప్రాధాన్యత లభిస్తున్నది. అన్ని స్థాయిలలోనూ, ఎవరికి వారు, జగన్ కోసం తాము ఎక్కువ ఆందోళన చెందాము, అల్లరి చేశాము, గట్టిగా అడిగాము అన్పించుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. తాము పెట్టే పొలికేకలు జగన్ చెవుల్లో పడాలని తాపత్రయపడుతున్నారు.

### పార్టీ చీలిక అసాధ్యం

జగన్‌ను ముఖ్యమంత్రిగా ప్రకటించకుంటే, అధిష్టానం మీద తిరుగుబాటు చేసి, పార్టీని చీల్చి వేస్తామని ప్రతిజ్ఞలు చేస్తున్నారు ఎమ్మెల్యేలు. అందుకు శ్రీకారం చుడితే మెజార్టీ ఎమ్మెల్యేలు తమతో వస్తారని, వారితో కొత్త పార్టీ పెట్టుకోవచ్చునని డంబాలు పలుకుతున్నారు. పార్టీ ఫిరాయింపుల చట్టం అనేది ఒకటి వుందని వీరెవరూ పట్టించుకోవడం లేదు.

వాజ్‌పాయి ప్రధానిగా వున్నప్పుడు, అప్పటి న్యాయశాఖ మంత్రి అరుణ్‌జైట్లీ ఫిరాయింపుల చట్టంలో చేసిన మార్పుల ప్రకారం, పార్టీలో చీలిక అసాధ్యం. శాసనసభలో కాంగ్రెస్‌కు వున్న 156 మంది ఎమ్మెల్యేలలో 155 మంది చీలి, కొత్త పార్టీ పెట్టుకొన్నా, అందరి సభ్యత్వాలూ రద్దయిపోతాయి. పార్టీ మీద తిరుగుబాటు అంటే, ఆరు నెలలు కూడా గడవకుండానే శాసనసభ్యత్వాన్ని కోల్పోవడం అన్న మాట. ఆ నిజం తెలిస్తే, ఒక్కరూ ఆ సాహసం చేయరని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.


## అశ్రునివాళి



ఆదరణ, అనురాగాలతో
అందరినీ అలరించిన
మమతానురాగాల అమృతమూర్తి,
మా ఇంటి వెలుగు, మా దైవం
శ్రీ మావూరి సత్యనారాయణ(బాబా) గారు
తేది 6-9-09 ఆదివారం
మధ్యాహ్నం 3.30 గం॥లకు
మమ్ములనువీడి దైవసాన్నిధ్యం చేరారు.
వారి ఆత్మకు శాంతి కలగించాలని
భగవంతుని ప్రార్థిస్తున్నాము.

కీ॥శే॥మావూరి సత్యనారాయణ(బాబా)గారు
చందన,CMR గ్రూప్

ఉత్తరక్రియలు
తేది 16-9-09 బుధవారం ఉ॥ 9గంటలకు విశాఖపట్నం,సీతమ్మధార,
KRM కాలనీలోని మా స్వగృహమున కర్మక్రతువులు జరుగును.
కావున తెలియజేయడమైనది.

కుమారులు
మావూరి వెంకటరమణ M.D
చందన, CMR గ్రూప్, విశాఖపట్నం
మావూరి శ్రీనివాసరావు
మేనేజింగ్ పార్టనర్ చందన, CMR గ్రూప్, నెల్లూరు.


Edited, Printed and Published by N. Dolendra Prasad. Ph: 091-861-2327354, Offset Printing at Zaminryot Press, Nellore.